
చెరుకువారిపల్లి ప్రాజెక్టు (చిత్తూరు జిల్లా)కు 20 లక్షలు చొప్పున నిధులను అందజేస్తున్న కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్


రామాపురంలో ఛిద్రమైన రహదారిని పరిశీలిస్తున్న కేంద్ర బృందం

నష్టపోయాం.. ఆదుకోండి

- కేంద్ర బృందం ఎదుట వాపోయిన బాధితులు
- జిల్లాలో పర్యటన.. తుఫాన్ నష్టాల పరిశీలన

మొంథా నష్టం రూ.370 కోట్లు : కలెక్టర్ వినోద్‌కుమార్

(బాపట్ల, చీరాల, పర్చూరు/కారంచేడు, ఆంధ్రజ్యోతి)
మొంథా తుఫాన్ ధాటికి తీవ్రంగా నష్టపోయాం.. వర్షాలు, వరదలు కడగండ్లు మిగిల్చాయి.. ఆదుకోండి అంటూ కేంద్ర బృందాన్ని బాధిత రైతులు అభ్యర్థించారు. కేంద్ర హోం మంత్రిత్వశాఖ సంయుక్త కార్యదర్శి పౌసుమి బసు నేతృత్వంలో ఆర్థికశాఖ ఎఫ్‌సీడీ ఉప సంచాలకులు మహేష్‌కుమార్, రోడ్డు రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వశాఖ కార్య నిర్వాహక ఇంజనీర్ శశాంక్ శేఖర్‌రాయ్, శాస్త్రవేత్త సాయిభగీరథ్ జిల్లాలో మంగళ వారం పర్యటించారు. కేంద్ర బృందం చీరాల, వేటపాలెం, కారంచేడు మండలాల్లో పర్యటించింది. తుఫాన్ నష్టాలపై శాఖల వారీగా నివేదికల రూపంలో కేంద్ర బృందానికి జిల్లా అధికారులు అందజేశారు. తొలుత చీరాలలోని ఐటీసీ అతిథి గృహంలో పంట నష్టం వివరా లతో అధికారులు ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను కేంద్ర బృందం పరిశీలించింది. రోడ్లు, కల్వర్టులు, వాగులతో పాటు పంటలకు జరిగిన నష్టాన్ని కలెక్టర్ వినోద్‌కుమార్ పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా కేంద్రబృందానికి వివరించారు. జిల్లాలోని 220 గ్రామాలపై తుఫాన్ ప్రభావం చూపిందని, లోతట్టు గ్రామాలు 30 నీటమునిగాయని, 31,490 కుటుంబాలకు వివిధ రూపాలలో మొంథా నష్టాన్ని మిగిల్చిందని తెలిపారు. మొత్తంగా జిల్లాకు రూ.370 కోట్ల నష్టాన్ని మొంథా మిగిల్చిందన్నారు. ఆ తర్వాత వాడరేవు నుంచి రామాపురం, పొట్టిసుబ్బయ్యపాలెం మార్గంలో కూలిన వంతెనలను కేంద్రబృందం పరిశీలించింది. మొదటి వంతెన 36 మీటర్లు, రెండో వంతెన 80 మీటర్లు మేర దెబ్బతిన్నట్లు అధికారులు వివరించారు. కారంచేడు మండలం స్వర్ణ గ్రామంలో కొమ్మమూరు కాల్వకు గండ్లు పడిన ప్రాంతాన్ని పరిశీలించారు. నీటమునిగిన 150 ఎకరాల పంట పొలాలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. గతంలో ఎకరాకు 33 బస్తాల వరకు పంట చేతికందిందని తుఫాన్ కారణంగా పూర్తిగా నష్టపోయామని రైతులు కేంద్ర బృందానికి వివరించారు. కప్పల వాగు - పర్చూరు కలిసే ప్రాంతంలో దెబ్బతిన్న జాతీయ రహదారి, బ్రిడ్జిలతో సమీపంలోని పొలాలను బృందం పరిశీలించింది. నష్టాలపై 60 పేజీల నివేదికను కలెక్టర్ కేంద్ర బృందానికి అందజేశారు. కారంచేడు మండల సమీపంలో దెబ్బతిన్న కొమ్మమూరు కాల్వతోపాటు, నీటమునిగిన పంటలు, బ్రిడ్జిలను పరిశీలించారు. కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్‌జైన్, ఆర్డీవోలు చంద్రశేఖర్‌నాయుడు, గ్లోరియా,తహసీల్దార్లుగీతారాణి,నాగరాజు ఉన్నారు.


కప్పల వాగు పరిస్థితిని సెంట్రల్ టీంకు వివరిస్తున్నరైతు ఉదయ భాస్కర్

మట్టి, జలంతోనే మనుగడ



- వాటి పరిరక్షణకే వాటర్‌షెడ్ కార్యక్రమం
- ఆరోగ్యం,ఆహ్లాదం,ఆదాయం సూత్రంతో రూపకల్పన
- వెంగళాయపాలెం నమూనాగా మరిన్ని చెరువుల అభివృద్ధి
- వాటర్‌షెడ్ మహోత్సవంలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్


సభకు హాజరైన మహిళలు, కార్యకర్తలు


అభివృద్ధి చేసిన వెంగళాయపాలెం చెరువును ప్రారంభిస్తున్న కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్ పెమ్మసాని, మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే బూర్ల


అభివృద్ధి చేసిన చెరువులును పరిశీలిస్తున్న కేంద్ర మంత్రులు

గుంటూరు(తూర్పు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): జీవన మనుగడకు మట్టి, జలాలే ముఖ్యమని కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. వాటర్‌షెడ్ మహోత్సవ్ పై గుంటూరులో రెండు రోజుల జాతీయ సదస్సు విజయవంతంగా జరిగింది. రెండో రోజు మంగళవారం గుంటూరు మండలం వెంగళాయపాలెం లయోలా పాఠశాలలో వాటర్‌షెడ్ మహోత్సవంలో శివరాజ్‌సింగ్ చౌహాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ జలం, మట్టి పరిరక్షణే వాటర్‌షెడ్ ముఖ్య ఉద్దేశమన్నారు. జల సంరక్షణ కార్యక్రమాలతో భూగర్భ జలాలు పెరగడమే గాక మట్టి సారవంతంగా మారుతుందని చెప్పారు. జల సంరక్షణ కార్యక్రమాలు సుస్థిర ఆర్థిక వ్యవస్థకు దోహదం చేస్తాయన్నారు. వెంగళాయపాలెం చెరువు నమూనాను దేశవ్యాప్తంగా అమలు చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. వీటి ద్వారా ప్రజలకు మంచి ఆరోగ్యం, సాంస్కృతిక వికాసానికి దోహదం అవుతుందని చెప్పారు. ప్రధానమంత్రి ఆవాస యోజన కింద ప్రతి ఒక్కరూ పక్కా గృహం కలిగి ఉండాలని ప్రభుత్వం భావిస్తోందని, ఇందుకు కలెక్టర్, ఎమ్మెల్యేలు సర్వే నిర్వహించి ఏ ఒక్కరూ గుడిసెల్లో ఉండకుండా చూడాలన్నారు. గతంలో రోడ్ల మరమ్మతులు, నిర్మాణాలకు పెమ్మసాని అడిగిన రూ.380 కోట్లను మంజూరు చేసినట్లు తెలిపారు.

వెంగళాయపాలెం చెరువు ప్రారంభం

వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో తొలుత రూ.1.20 కోట్లతో అభివృద్ధి చేసిన వెంగళాయపాలెం చెరువును కేంద్ర, రాష్ట్ర మంత్రులు ప్రారంభించారు. చెరువు వద్ద విఘ్నేశ్వరుడు, పోలేరమ్మ అమ్మవారి, ఆలయాన్ని వారు దర్శించుకున్నారు. నక్షత్ర వనంలో మొక్కలను నాటారు. వాకింగ్ ట్రాక్ పై నడిచి పరిశీలించారు. పునరుద్ధరించిన బావిని, చిన్నారులకు ఏర్పాటు చేసిన పార్కు, ఓపెన్ జిమ్, సిమెంట్ బెంచీలను, ఓపెన్ ఎయిర్ థియేటర్‌ను పరిశీలించారు. ఢిల్లీ దుర్ఘటన నేపథ్యంలో వెంగళాయపాలెంలో నాయకులు, కార్యకర్తలు ఏర్పాటు చేసిన బైక్, కార్ల ర్యాలీని (మిగతా 7వ పేజీలో)



చెరువుల అభివృద్ధికి చర్యలు

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

దేశంలో పురాతన నీటి చెరువుల అభివృద్ధితో పాటు నూతనంగా చెరువులను తవ్వుతామని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. వాటర్‌షెడ్ మిషన్ కింద చెక్‌డ్యాంలు, స్టాక్ డ్యాంలు వంటి నీటి వనరులు పునరుద్ధరణ జరిగాయన్నారు. దీంతో రైతులకు ఎంతో లబ్ధి చేకూరిందన్నారు. వెంగళాయపాలెం చెరువులో కొబ్బరిచెట్లు, చేపలు, బాతుల పెంపకంతో గ్రామానికి ఏడాదికి రూ.5 లక్షలు ఆదాయం సమకూరుతుందన్నారు.



భూగర్భ జలాల రక్షణ

మంత్రి కందుల దుర్గేష్

భూగర్భ జలాలను రక్షించుకునేందుకు బృహత్తర కార్యక్రమాన్ని రూపొందించినట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. గతంలోనే నీటిని పరిరక్షించుకునేందుకు చంద్రబాబు ఇంకుడు గుంతలు కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. జల జీవన్ మిషన్ ద్వారా సాగు భూములకు నీరు అందించేందుకు పవన్‌కల్యాణ్ ఆలోచనలకు ఈ పథకం తోడ్పడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వ భూ వనరుల విభాగం కార్యదర్శి మనోజ్‌జోషి మాట్లా డుతూ వాటర్‌షెడ్ కార్యక్రమాలతో భూగర్భ జలాలు మూడు మీటర్లు వరకు పెరిగాయన్నారు.

దినచర్యలో యోగా ఓ భాగం కావాలి

- దీక్షారంబ్ సభలో వర్సిటీ అగ్రికల్చర్ డీన్ శ్రీనివాస్


జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమ దినచర్యలో యోగాను ఓ భాగం చేసుకోవాలని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం అగ్రికల్చర్ డీన్ డాక్టర్ సి.శ్రీనివాస్ తెలిపారు. దీక్షారంబ్ 2025 అంకురార్పణ సభ బాపట్ల వ్యవసాయ కళాశాల మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో రెండో అత్యంత పురాతనమైన కళాశాలగా బాపట్ల వ్యవసాయ కళాశాలకు గుర్తింపు ఉందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచి కళాశాల జీవితానికి సులభంగా మారేందుకు దీక్షారంబ్ కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు. ఈ నెల 22 వరకు జరిగే కార్యక్రమాల్లో యోగా, నైతిక విలువలు బోధించబడతాయన్నారు. ప్రతిరోజు ఒక విషయ నిపుణుడిచే ఉపన్యాసం ఉంటుందన్నారు. నూతన విద్యార్థులలో సహజంగా కలిగే భయం, ఆందోళన, ఆత్మన్యూనత భావాన్ని పోగొట్టడానికి దీక్షారంబ్ కార్యక్రమాలు ఉపకరిస్తాయన్నారు. స్టూడెంట్ అఫైర్స్ డీన్ డాక్టర్ జి.రామచంద్రరావు మాట్లాడుతూ విద్యార్థుల సమగ్రాభివృద్ధికి నూతన జాతీయ విద్యా విధానం దోహదం చేస్తుందన్నారు. నాలుగేళ్ల బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సులో ప్రతిదశలో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకోవాలన్నారు. కళాశాలలోని అధునాతన సదుపాయాలు, నిబద్ధత గల అధ్యాపకులు ఉన్నారని ఈ అవకాశాన్ని విద్యార్థులు సమర్థంగా ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనారాణి, వార్డెన్లు డాక్టర్ కె.చంద్రశేఖర్, డాక్టర్ కె.జయలలిత, విద్యార్థి విభాగాధికారి డాక్టర్ శ్రీరేఖ, డాక్టర్ లాల్‌అహ్మద్ మొహ్మద్, డాక్టర్ ఎస్.ఆర్.కోటేశ్వరరావు, బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

ఆజాద్ సేవలు స్ఫూర్తిదాయకం

జయంతి కార్యక్రమంలో ఎస్పీ ఉమామహేశ్వర్

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడిగా, భారతదేశ తొలి విద్యాశాఖ మంత్రిగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ అందించిన సేవలు అందరికీ స్ఫూర్తిదాయకమని ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. మౌలానా జయంతిని మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆజాద్ చిత్రపటానికి అధికారులు, సిబ్బందితో కలిసి ఎస్పీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాట చరిత్రలో విశిష్ఠ స్థానం సంపాదించిన మహనీయుడు ఆజాద్ అన్నారు. మహాత్మాగాంధీ ఆశయాలకు అనుగుణంగా ఖిలాఫత్ ఉద్యమం, సహాయ నిరాకరణోద్యమం, ఉప్పుసత్యాగ్రహం, క్విట్‌ఇండియా ఉద్యమాల్లో ఆయన కీలకపాత్ర పోషించారన్నారు. భారత విద్యావ్యవస్థకు ఆజాద్ బలమైన పునాది వేశారన్నారు. ఈ కారణంగానే ఆయన జయంతిని జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో బి.శ్రీనివాసరావు, ఇన్‌స్పెక్టర్లు జి.నారాయణ, ఆర్.అహ్మద్ జానీ, యు.శ్రీనివాసరావు, అడ్మిన్ ఆర్ఐ షేక్.మౌలుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో..


ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న ఎస్పీ ఉమామహేశ్వర్, సిబ్బంది

కలెక్టరేట్‌లో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ 137వ జయంతి నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్.విజయమ్మతో పాటు కలెక్టరేట్ అధికారులు ఆజాద్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. ఆయన విద్యావ్యవస్థకు బలమైన పునాది వేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పఠాన్ మహ్మద్‌ఖాన్, డాక్టర్ అల్లాభక్షు, దిలీప్, మౌలాబేగ్ తదితరులు పాల్గొన్నారు.

ప్లాట్లకు అనుమతులు తప్పనిసరి

ఏపీ సీఆర్డీఏ కార్యాలయం ప్రకటన

తుళ్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలో అనుమతులు ఉన్న ప్లాట్లను మాత్రమే కొనుగోలు చేయాలని ఏపీసీఆర్డీఏ ప్రధాన కార్యాలయ అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ(ఏపీ సీఆర్డీఏ) పరిధిలో కొన్ని గ్రామాల్లో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన అక్రమ లేఅవుట్లపై అధికారులు చర్యలు తీసుకున్నారు. అనధికారిక భవనాలను కూడా తొలగించారు. ఈ పరిస్థితుల్లో అనధికార లేఅవుట్లలో ప్లాట్లు కొనుగోలు చేస్తే భవన నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేసేది లేదని తేల్చిచెప్పారు.

పారిశ్రామికంగా.. పరుగులు

- పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు
- మూడు నియోజకవర్గాల్లో ఎంఎస్‌ఎంఈలు
- వర్చువల్‌గా సీఎం శంకుస్థాపన

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)
పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్ద పీట వేస్తోంది. ఎక్కడికక్కడ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఉపాధి కల్పనకు చర్యలు చేపట్టింది. పలు నియోజకవర్గాల్లో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమ(ఎంఎస్‌ఎంఈ) పార్కులు నెలకొల్పు తున్నారు. జిల్లాలో రేపల్లె, అమృతలూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలో పారిశ్రామికవాడలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా ప్రాంతాల్లో పరిశ్రమల ఏర్పాటుకు కావాల్సిన వసతులను కల్పించనున్నారు. రోడ్లు, విద్యుత్, నీటి, డ్రెయిన్లను (మిగతా 7వ పేజీలో)



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొండయ్య, పక్కన కలెక్టర్ వినోద్‌కుమార్, జేసీ

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

భూమిపూజలో ఎమ్మెల్యే ఆనందబాబు

అమృతలూరు: ఎంఎస్‌ఎంఈల్లో ఏర్పాటు చేసే పరిశ్రమలతో యువతకు ఉపాధి అవకాశలు లభిస్తాయని ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు తెలిపారు. గోవాడ బాలకోటేశ్వర స్వామి ఆలయం వద్ద పారిశ్రామికవాడకు మంగళవారం జరిగిన భూమిపూజ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 6.86 ఎకరాల విస్తీర్ణంలో రూ.12 కోట్లతో సూక్ష్మ చిన్న మధ్యతరహా పరిశ్రమలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన వేమూరు నియోజకవర్గం పారిశ్రామికంగా అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారి నాగిరెడ్డి, మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ గొట్టిపాటి పూర్ణకుమారి, తహసీల్దార్ నెహ్రూబాబు, ఎంపీడీవో మారుతీ శేషామాంబ, సర్పంచ్ విజయలక్ష్మి, పార్టీ మండల అధ్యక్షుడు కొత్తపల్లి రవీంద్రబాబు, మైనేని మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆనందబాబు

నేతన్నల ఆదాయాల్లో మార్పులు

- హ్యాండ్‌లూమ్ పార్కు భూమిపూజలో ఎమ్మెల్యే, కలెక్టర్

వేటపాలెం(చీరాల): హ్యాండ్‌లూమ్ పార్కు ఏర్పాటుతో నేతన్నల తలసరి ఆదాయాల్లో మార్పులు వస్తాయని ఎమ్మెల్యే కొండయ్య, కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. చల్లారెడ్డిపాలెం పంచాయతీ నాయనిపల్లిలో చేనేత హ్యాండ్‌లూమ్ పార్కుకు జరిగిన భూమిపూజలో వారు పాల్గొని ప్రసంగించారు. నేతన్నల చిరకాల వాంఛ అయిన హ్యాండ్‌లూమ్ పార్కుకు 23.81 ఎకరాలు కేటాయించామన్నారు. రూ.8.5 కోట్లతో అభివృద్ధి చేస్తామన్నారు. జిల్లాలోని మూడు పారిశ్రామికవాడలకు సుమారు రూ.30 కోట్లు వెచ్చించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో జేసీ విశిష్ట భావన, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహారావు, హ్యాండ్‌లూమ్ ఏడీ రఘునందన్, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గీతారాణి, హ్యాండ్‌లూమ్ చైర్మన్ సజ్జా హేమలత, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు, నాయకులు సిద్ధి బుచ్చేశ్వరరావు, వీరభద్రయ్య పాల్గొన్నారు.

జమిలి ఎన్నికలే పరిష్కారం

- ఏటా ఎన్నికలతో సమయం, డబ్బు వృథా!
- ఐదేళ్లలో ఒకసారే ఎన్నికలు జరగాలి
- రోజువారీ అవసరాలకు స్వదేశీ వస్తువులనే కొనండి
- మంగళగిరి చీరలు, వస్త్రాలు అద్భుతం
- ఆత్మనిర్భర్ భారత్ సభలో కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్


వెంగళాయపాలెం చెరువు వద్ద మొక్క నాటి నీరు పోస్తున్న కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని

గుంటూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): 'ఏటా రెండు సార్లు ఎన్నికలు వస్తున్నాయి. ఐదేళ్లలో పదిసార్లు.. ఏదో ఒక రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ ఎన్నికల కోసం ప్రధాని మోదీ.. మాలాంటి మంత్రులు ఎంతో సమయం వెచ్చించాల్సి వస్తోంది. అదే సమయం ప్రజల కోసం వెచ్చిస్తే.. ఎంత బాగుంటుంది. ఇలా నిరంతరం ఎన్నికలు రావడం వల్ల మా సమయమే కాదు, అధికారులు, ప్రజల సమయం, డబ్బు ఎంతో వృథా అవుతోంది. ఎన్నికల కోడ్ కారణంగా అభివృద్ధి ఆగిపోతోంది. అదే ఐదేళ్లలో ఎన్నికలు ఒకేసారి జరిగితే.. ఎంత మేలు జరుగుతుంది? ఎంత సమయం, డబ్బు ఆదా అవుతుంది? ఆలోచించండి. అందుకే ప్రధాని మోదీ, మంత్రులు దీనిపై ఒక ఆలోచన చేశాం. దేశ పార్లమెంటుకు, రాష్ట్ర అసెంబ్లీలకు ఐదేళ్లలో ఒకసారే ఎన్నికలు జరిగేలా జమిలి ఎన్నికలు తీసుకురావాలని భావించాం' అంటూ కేంద్ర వ్యవసాయ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ స్పష్టంచేశారు. గుంటూరులోని ఎల్‌వీఆర్ క్లబ్‌లో మంగళవారం నిర్వహించిన 'ఆత్మనిర్భర్ భారత్ సంకల్ప అభియాన్' నగర ప్రముఖుల సమ్మేళనంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఆయనతోపాటు కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు చెరుకూరి తిరుపతిరావు అధ్యక్షత వహించిన ఈ సమ్మేళనంలో మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మాట్లాడుతూ దేశం స్వధర్మం, స్వదేశీ అనే లక్ష్యంతో దేశాన్ని స్వావలంబన దిశగా నిలపడమే ఆత్మనిర్భర్ భారత్ ముఖ్య ఉద్దేశమన్నారు. సనాతన, నిత్యనూతన భావాలను జోడించి ఆత్మనిర్భర్ భారత్‌ను నిర్మిస్తున్నామన్నారు. వాజపేయి ప్రధానిగా ఉన్న సమయంలో


వెంగళాయపాలెం చెరువు వద్ద బావిలో నీరు తోడుతున్న కేంద్రమంత్రులు శివరాజ్‌సింగ్ చౌహాన్, పెమ్మసాని, రాష్ట్రమంత్రి కందుల దుర్గేష్ తదితరులు


గుంటూరు : శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను సన్మానిస్తున్న ఎల్‌వీఆర్ క్లబ్ సభ్యులు

పోఖ్రాన్ అణు పరీక్ష మొదలు మోదీ ప్రధాని అయ్యాక దేశ రక్షణ వ్యవస్థ స్వావలంబన సాధించిందన్నారు. అంతరిక్ష రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో మంగళయాన్ విజయవంతం చేసుకొని దీటుగా నిలిచామన్నారు. ఇప్పుడు ప్రపంచ నాలుగో ఆర్థిక వ్యవస్థగా అవతరించి, దేశాన్ని పాలించిన యూకేను కూడా వెనక్కినెట్టామని, మూడో ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతున్నామన్నారు. ఇదంతా ప్రధాని మోదీ కృషిలో భాగమేనని, అందుకే ప్రపంచం నలుమూలల నుంచి మోదీ పేరు మారుమోగుతోందన్నారు. దేశంపై టారిఫ్‌ల మోత మోగిపోతున్నా దీటుగా ఎదుర్కోగలుగుతున్నామన్నారు. ఆత్మ నిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా దేశీయ ఉత్పత్తులను, దేశంలోని మేధోవంతమైన యువశక్తిని ప్రోత్సహించాలనుకుంటున్నాం. నా సహ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌లాంటి యువకుల అపార శక్తి ఆత్మనిర్భర్ భారత్ ద్వారా దేశానికి ఉపయోగపడేలా చేస్తామన్నారు. ప్రతి ఒక్కరూ తమ రోజువారీ అవసరాల కోసం దేశీయ ఉత్పత్తులనే వినియోగించాలని కోరారు. బీహార్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయ దుందుభి మోగించబోతున్నామని చెప్పారు. ఇండియా కూటమికి అభివృద్ధి నినాదం లేక వారు ఓట్ చోరీ నినాదంతో ఎన్నికలకు వెళ్లారని చెప్పారు. బీహార్‌లో అభివృద్ధి ప్రభుత్వమే మళ్లీ అధికారం చేపట్టబోతోందన్నారు. నాడు జాతిని సమైఖ్యపరిచిన వందేమాతర గీతాన్ని కాంగ్రెస్ నిషేదించి దేశ విభజనకు బీజం వేసిందన్నారు. ఆ నష్టం ఇంకా కొనసాగుతోందని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి మంగళగిరి చీరల గురించి ప్రస్తావించారు. మంగళగిరి చీరలు, వస్త్రాలు ఎంత అద్భుతంగా ఉంటాయో తెలుసా.. అంత అద్భుతమైన ఉత్పత్తులు కేవలం దేశంలోనే తయారవుతున్నాయని కొనియాడారు.

బాబు- మోదీ.. వన్ ప్లస్ వన్ లెవెన్..

రాష్ట్రంలో మోదీ-చంద్రబాబు-పవన్ కల్యాణ్ కలయిక నిజమైన ఎన్డీఏ కూటమి స్ఫూర్తికి నిదర్శనమన్నారు. అదో అద్భుతమైన కలయికగా అభివర్ణించారు. మోదీ- బాబు ద్వయం వన్ ప్లస్ వన్ అంటే రెండు కాదని, వన్ ప్లస్ వన్ లెవెన్ అని, విజనరీ లీడర్ చంద్రబాబు నేతృత్వంలో రాష్ట్రం పదకొండింతల అభివృద్ధిని సాధించబోతోందని చెప్పారు. మొంథా తుపాను నష్టంపై కేంద్ర వ్యవసాయ శాఖ విచారించి తగిన న్యాయం జరిగేలా చూస్తానని శివరాజ్‌సింగ్ చౌహాన్ హామీ ఇచ్చారు.

వాటర్ షెడ్ సదస్సు సక్సెస్

- వెంగళాయపాలెం చెరువును చూసి ప్రతినిధుల ఆశ్చర్యం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్ జాతీయ సదస్సును గుంటూరు గ్రామీణాభివృద్ధిశాఖ సహకారంతో జిల్లా యంత్రాంగం విజయవంతంగా నిర్వహించింది. కేవలం 15 రోజుల వ్యవధిలోనే ఒక పాడుపడిన చెరువును పునరుద్ధరించి తీర్చిదిద్దింది. ఇందుకోసం అహర్నిశలు ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ కమిటీ నాయకులు శ్రమించారు. కీలకమైన సదస్సును ఐటీసీ వెల్‌కం హోటల్‌లో, బహిరంగ సభను నల్లపాడు లయోల పబ్లిక్ స్కూల్ గ్రౌండ్‌లో ఘనంగా నిర్వహించింది. సదస్సుకు వివిధ రాష్ట్రాల నుంచి తరలివచ్చిన వాటర్ షెడ్ అధికారులకు చక్కటి ఆతిథ్యాన్నిచ్చింది. బహిరంగ సభకు హాజరైన వేలాదిమంది మహిళలకు రవాణా, భోజన సదుపాయాలను కల్పించింది. ఢిల్లీలో బాంబుపేలుళ్ల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసి సదస్సును విజయవంతంగా ముగించింది.

ప్రజా దర్బార్‌కు వినతుల వెల్లువ

స్వయంగా అర్జీలు స్వీకరించిన మంత్రి లోకేశ్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ

మంగళగిరి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో మంత్రి నారా లోకేశ్ మంగళవారం 72వ రోజు ప్రజాదర్బార్ నిర్వహించారు. మంత్రి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలను చెప్పుకునేందుకు రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు. ప్రతి ఒక్కరినీ ఆప్యాయంగా పలుకరించిన మంత్రి లోకేశ్ వారి సమస్యలను సావధానంగా విన్నారు. తక్షణ పరిష్కారం అవసరమైన సమస్యలపై అప్పటికప్పుడే సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. భవన నిర్మాణ కార్మికురాలిగా పనిచేస్తున్న తన తల్లి 9 నెలల క్రితం మరణించారని, నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కింద తమకు ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని గుంటూరు జిల్లా ప్రత్తిపాడుకు చెందిన కోడూరు అశోక్ విజ్ఞప్తి చేశారు. ఆప్కాస్ కింద ఆఫీస్ సబార్డినేట్ ఉద్యోగం చేస్తున్న తాను రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయానని, పొరుగు సేవల ఉద్యోగి కావడంతో తనకు దివ్యాంగ పెన్షన్ అందడంలేదని గుంటూరు జిల్లా ఉప్పలపాడుకు చెందిన భాస్కర్ ఆవేదన వ్యక్తం చేశారు. టీడీపీ సానుభూతిపరుడిననే కక్షతో వైసీపీ హయాంలో అప్పటి ధర్మవరం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తనపై అక్రమంగా హత్య కేసు బనాయించి ఇబ్బందులకు గురిచేశాడని సత్యసాయి జిల్లా ముదిగుబ్బ మండలం శిరిగారిపల్లికి చెందిన రవీంద్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. వైసీపీ హయాంలో తొలగించిన దివ్యాంగ పెన్షన్‌ను పునరుద్ధరించాలని విజయవాడ రాణీగారితోటకు చెందిన షేక్ గుల్జార్ విన్నవించారు. ఆయా సమస్యలను పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని మంత్రి లోకేశ్ అర్జీదారులకు హామీ ఇచ్చారు.


బాధితుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి లోకేశ్



స్నానానికి కాలువలో దిగి మహిళ మృతి

గంటవారిపాలెం (శావల్యాపురం), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్నానం చేసేందుకు కెనాల్‌లోకి దిగిన మహిళ ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందింది. ఈ సంఘటన శావల్యాపురం మండలం గంటవారిపాలెం గ్రామ సమీపంలోని అద్దంకి బ్రాంచ్ కాలువ వద్ద మంగళవారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం, వినుకొండలోని కోట్నాల్ప బజారులో నివాసం ఉంటున్న పఠాన్ గౌస్య (34), ఆమె భర్త సుభానీ, అత్త జాన్‌బీతో కలిసి గంటవారిపాలెంలోని అద్దంకి బ్రాంచ్ కాలువ వద్దనున్న శ్రీలక్ష్మీ తిరుపతమ్మతల్లి దేవాలయానికి వచ్చింది. దేవాలయంలో పూజకు ముందుగా అద్దంకి బ్రాంచ్ కెనాల్‌లో స్నానం చేసేందుకు వారితో కలిసి వెళ్లింది. మొదట భర్త సుభానీ స్నానంచేసి బయటకురాగా గౌస్య, జాన్‌బీ స్నానానికి కెనాల్‌లోకి దిగారు. కెనాల్‌లో నీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రమాదవశాత్తు ఇద్దరూ కెనాల్‌లోకి జారి పడ్డారు. అక్కడున్న వారు వెంటనే ఇద్దరినీ కాపాడేందుకు ప్రయత్నించగా జాన్‌బీ సురక్షితంగా బయటకురాగా గౌస్య కెనాల్‌లో కొట్టుకుపోయి మృతి చెందింది. స్థానికులు సమాచారంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని గౌస్య మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం వినుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లోకేశ్వరరావు తెలిపారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్' సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.

కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం



'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక భాగ్యశ్రీ బోర్సే అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

- కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.
- నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో



కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురిచేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్'(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది



- అక్కినేని నాగార్జున

'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వెగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్ర్కీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్, శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు, కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా రేలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆద్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రేలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.



కొండుభొట్లపాలెం అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి గ్రామస్థులతో మాట్లాడుతున్న ఫుడ్‌కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి

నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలి

● రాష్ట్ర ఫుడ్‌కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి
● బాపట్లలోని పలు స్కూళ్లు, చౌక దుకాణాల్లో తనిఖీ

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలని రాష్ట్ర ఫుడ్‌కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి అన్నారు. బాపట్ల పట్టణం, వేటపాలెం, చినగంజాం మండలాలలో మంగళవారం ఆమె విస్తృతంగా పర్యటించి జడ్పీ పాఠశాలలను, అంగన్వాడీ కేంద్రాలను, చౌకధరల దుకాణాలలో తనిఖీలు చేశారు. కొండుభొట్లపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, సూర్యలంకరోడ్డులోని సరస్వతీమెమోరియల్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో కొంతమంది విద్యార్థులు మధ్యాహ్నం లంచ్‌బాక్స్ తెచ్చుకుంటున్నారని తెలుసుకొని, నాణ్యత లేకపోవటం వల్ల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని ప్రధానోపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ రాధామాధవి, జీసీడీవో చారులత, సీడీపీవో లక్ష్మీపార్వతి, జిల్లా సాంఘిక సంక్షేమశాఖాదికారిణి జె.రాజాదెబోరా, ఎంఈవో డీ.ప్రసాదరావు, డీఎమ్అండ్ హెచ్‌వో డాక్టర్ ఎస్.విజయమ్మ తదితరులు పాల్గొన్నారు.

50,993 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు మంగళవారం 53,391 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా ముందురోజు నిల్వ ఉన్న వాటితో కలిపి 50,993 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఉన్నతశ్రేణి కార్యదర్శి ఏ చంద్రిక తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 10,744 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర	వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ			ఆర్మూరు	10000	13500
334	10000	17000	**ఏసీ కామన్ వెరైటీ**		
నెంబరు. 5	10000	14300	334	10500	16500
273	10500	14200	నెంబరు. 5	10000	14600
341	10000	16800	273	----	----
4884	----	----	341	10000	17200
సూపర్ 10	11000	16000	4884	11000	14500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ			**ఏసీ స్పెషల్ వెరైటీ**		
తేజ	10000	15700	తేజ	10000	15500
షార్క్-1	-----	----	బ్యాడిగి	10000	16800
బ్యాడిగి	10500	16700	దేవనూరు డీలక్స్	10500	16000
దేవనూరు డీలక్స్	-----	----	తాలుకాయలు	5000	8800

మృత్యువును ఎదురించిన మిరాకిల్ బేబీ..!

● 24 వారాలకే జన్మించిన శిశువు
● శిశువుకు గుండె, కంటి, ఊపిరితిత్తుల సమస్యలు
● రమేష్ ఆసుపత్రిలో 3 నెలల చికిత్సతో కోలుకున్నవైనం
● దక్షిణ భారతదేశంలో తొలి కేసుగా వైద్యుల వెల్లడి

గుంటూరు మెడికల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): కేవలం 700 గ్రాముల బరువుతో.. నెలలు నిండకుండా గుండె, ఊపిరితిత్తులు, కంటి ఆరోగ్య సమస్యలతో జన్మించిన ఓ శిశువును గుంటూరు ఆస్టర్ రమేష్ ఆసుపత్రి వైద్యులు మృత్యు ఒడి నుంచి రక్షించారు. మంగళవారం ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో ఈ అరుదైన కేసు వివరాలను ఆసుపత్రి డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్



శిశువుతో రమేష్ ఆసుపత్రి వైద్య బృందం

డాక్టర్ రాయపాటి మమత తెలియజేశారు. ఫిరంగిపురం మండలం వేములూరిపాలెం గ్రామానికి చెందిన గర్భిణి కొండెపాటి ప్రత్యూష ఈ ఏడాది జూలై 5వ తేదీన రమేష్ ఆసుపత్రిలో 24 వారాల మగ శిశువుకు జన్మనిచ్చారని చెప్పారు. బిడ్డ బరువు 700 గ్రాముల ఉండడంతో ఎన్ఐసీయూలో ఉంచామని, ఊపిరితిత్తులు, గుండె బలహీనంగా ఉండటంతో ప్రత్యేకమైన మందులిచ్చి చికితస చేసినట్లు వైద్యం చెప్పారు. రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్, బ్రాంకో పల్మనరీ డిస్‌ప్లేసియా వంటి ప్రాణాంతక పరిస్థితులకు చికిత్స చేశామని, పీడీఏ సమస్యతో గుండెలో రంధ్రం మూసుకోపోకుండా పీడియాట్రిక్ కార్డియాలజీ బృందం చికిత్సను అందించిందని తెలిపారు. కంటికి సంబంధించి రెటినోపతి ఆఫ్ ప్రీమెచ్యూరిటీ సమస్యను లేజర్ చికిత్స ద్వారా నయం చేశామని చెప్పారు. శిశువును 120 రోజుల పాటు ఎన్ఐసీయూలో ఉంచి చికిత్స చేయడంతో పూర్తిగా కోలుకున్నాడని తెలిపారు. ఈ తరహా కేసు దక్షిణ భారతదేశంలో ఇదే మొదటిదని మమత తెలిపారు. తమ బిడ్డకు కొత్త జన్మను ప్రసాదించిన రమేష్ ఆసుపత్రి వైద్య బృందానికి శిశువు తల్లిదండ్రులు దినేశ్, ప్రత్యూష కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో ఆసుపత్రి వైద్యనిపుణులు అనిత చాగంటి, మహేశ్, అనురాధ, వసంత, భరత్ సిద్దార్థ, తస్వీర్ బేగం, భాను తేజ తదితరులు పాల్గొన్నారు.

మహిళల విద్యతోనే సమాజాభివృద్ధి

● ఏఎన్‌యూ వీసీ ఆచార్య గంగాధరరావు ● ఘనంగా మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

ఏఎన్‌యూ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): మహిళలు విద్యా వంతులైతేనే సమాజం అభివృద్ధి దిశగా పయనిస్తుందని ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం వీసీ ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. విశ్వవిద్యాలయం విద్యా విభాగం ఆధ్వర్యంలో మంగళవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి సందర్భంగా జాతీయ విద్యాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపకులపతి పాల్గొని మాట్లాడుతూ, మౌలానా అబుల్ కలాం ఆజాద్‌ను నేటితరం విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలాన్నారు. దేశానికి మొదటి విద్యాశాఖ మంత్రిగా అబుల్ కలాం ఆజాద్ ఎంతో విలువైన సేవ చేశారన్నారు. ఆయన రచనలు ఎంతోమందికి స్ఫూర్తినిస్తాయని పేర్కొన్నారు. ఈ వేడుకలకు విభాగాధిపతి ఆచార్య పి.బ్రహ్మాజీరావు అధ్యక్షత వహించారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న వీసీ గంగాధరరావు

ముందుగా మౌలానా అబుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. అలాగే ఢిల్లీలో జరిగిన పేలుళ్లలో మృతిచెందిన వారికి సంతాపం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, సైన్స్, ఆర్ట్స్ కళాశాలల ప్రిన్సిపాళ్లు ఆచార్య కె.వీరయ్య, ఆచార్య ఎం.సురేష్ కుమార్, ఆచార్య బ్రహ్మాజీరావు, రూసా కోఆర్డినేటర్ ఆచార్య ఎస్.మురళీమోహన్, డిగ్రి పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య ఎన్.వి.కృష్ణారావు, విభాగం అధ్యాపకులు డాక్టర్ టి.సందీప్, విద్యార్థులు పాల్గొన్నారు.

శివస్వాతి టెక్స్‌టైల్స్‌ను సందర్శించిన ఏఎన్‌యూ విద్యార్థులు

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ సోషియాలజీ, సోషల్ వర్క్ విద్యార్థులు మంగళవారం చిలకలూరిపేటలోని ఇంటర్నేషనల్ శివస్వాతి టెక్స్‌టైల్స్‌ను సందర్శించారు. ఈ కార్యక్రమానికి విభాగాధిపతి ప్రొఫెసర్. ఏం.త్రిమూర్తిరావు ఆధ్వర్యంలో అతిథి అధ్యాపకులు డాక్టర్ పి.రాజకుమార్, డాక్టర్ ఎస్.రాజశేఖర్ సమన్వయకర్తలు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఏఎంజీ అధ్యక్షుడు డాక్టర్ అరుణ్ కుమార్ మెహంతి, చీఫ్ ఫైనాన్స్ ఆఫీసర్ సుకుమార్ విద్యార్థులకు వారి సంస్థ సేవా కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి ఏర్పాట్లు చేసిన ఎంఎల్ కంపెనీ సీనియర్ హెచ్ఆర్‌లు డాక్టర్ బాబురావు, డాక్టర్ రవీంద్రబాబుకు ఏం.త్రిమూర్తిరావు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పరిశోధక విద్యార్థులు చరణ గుప్తా, రాజేశ్, నాగేశ్వరరావు, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.6.00 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	122, 132, 142
చికెన్ విత్ స్కిన్(కిలో)	230.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	240.00

మట్టి, జలంతోనే.. మనుగడ

(5వ పేజీ తరువాయి)

వాయిదా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్‌అహ్మద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, జీడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లు మక్కెన మల్లికార్జునరావు, వడ్రాణం హరిబాబు, కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, మన్నవ మోహన కృష్ణ, పిల్లి మాణిక్యరావు, డిప్యూటి మేయర్ షేక్ సజీలా, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్‌కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరి నితిన్‌కడే, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె.షణ్ముఖ కుమార్, జాయింట్ కమిషనర్ శివరాం, రాష్ట్ర పంచాయతీ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసానికి ప్రశంసలు

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ పెమ్మసాని చంద్రశేఖర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజలకు సేవ చేసేందుకే ఆయన రాజకీయాల్లోకి వచ్చారన్నారు. కొత్తగా రాజకీయాల్లో ప్రవేశించినప్పటికీ ప్రభుత్వ పథకాలపై ఆయన అవగాహన అభినందనీయ మని కితాబిచ్చారు. హిందీలో ఆయన మాట్లాడుతుంటే హిందీ మాతృ భాష కలిగిన వారికే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. నేను కూడా తెలు గు నేర్చుకొని ఈసారి వచ్చినప్పుడు అదేస్థాయిలో తెలుగులో ప్రసంగి స్తానని చెప్పారు. చెరువును సుందరంగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, అధికారులను అభినందించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వాటర్‌షెడ్ జన్ భగీరథికప్ 2025 బహుమతులు అందజేశారు.

పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు

(5వ పేజీ తరువాయి)

కూడా నిర్మించనున్నారు. పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడంతో పాటు కొత్తగా పరిశ్రమల రంగంలోకి అడుగు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహాలను అందించనున్నది. ఇందుకోసం పరిశ్రమలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. బ్యాంకుల రుణాలతో పాటు కొన్ని రకాల పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు రాయితీలు కల్పించనున్నాయి. జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మంగళవారం కనిగిరి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా గోవాడ, నాయనిపల్లి, నిజాంపట్నంలో ఎంఎస్ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు.

వ్యాపారులకు తోడ్పాటు

నిజాంపట్నంలో ఆర్డీవో రామలక్ష్మి



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఆర్డీవో రామలక్ష్మి, అనగాని శివప్రసాద్

రేపల్లె: వ్యాపారులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. నిజాంపట్నంలో ఎంఎస్ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. పారిశ్రామికవాడ ఏర్పాటుకు నాలుగు ఎకరాలు కేటాయించగా, 181 మందికి అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్లాట్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, కృష్ణా పశ్చిమ డెల్టా పీసీ చైర్మన్ పంతాని మురళీధరరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకట్‌యాదవ్, ఇన్‌చార్జి తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జీఎం వై.రామకృష్ణ, ఎంపీడీవో ఎం.నాగలక్ష్మి, టీడీపీ నాయకులు నర్రా సుబ్బయ్య, బొమ్మిడి రామకృష్ణ, తాతా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక మోసాలపై
ఏఎన్‌యూలో సింపోజియం

ఏఎన్‌యూ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక పరిపాలన విధానాలను పాటిస్తూ పరిశ్రమలు స్థాపించాలని ఏఎన్‌యూ తాత్కాలిక ఉపకులపతి ఆచార్య కె.గంగాధరరావు అన్నారు. అమరావతి చాప్టర్‌కు సంబంధించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా, ఏఎన్‌యూ కామర్స్, మేనేజ్మెంట్ విభాగం సంయుక్తంగా మంగళవారం ఆర్థిక మోసాల నివారణలో కార్పొరేట్ గవర్నెన్స్ పాత్ర అనే అంశంపై సింపోజియంను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన గంగాధరరావు మాట్లాడుతూ, ఆర్థిక మోసాల నివారణలో కార్పొరేట్ గవర్నెన్స్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సంస్థలు పరిశ్రమలు స్థాపించేటప్పుడు వాటి పరిపాలన విధానాలను నిర్ధారించుకోవాలన్నారు. వాటిని పరిగణనలోకి తీసుకొని పెట్టుబడులు పెట్టాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఐసీఎస్ఐ కేంద్రీయ సభ్యులు వెంకటరమణ, డాక్టర్ ఆహ్లాదరావు, మాజీ ఉపాధ్యక్షుడు డాక్టర్ నాగరాజు, చైర్మన్ డాక్టర్ వీవీఎస్ఆర్ మహమ్మద్ అబ్బాస్ సయ్యద్, ఐసీఎల్ఎస్ రిజిస్ట్రార్ వరప్రసాదరావు, ఏఎన్‌యూ తాత్కాలిక రెక్టార్ ఆచార్య శివరాంప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సురేశ్ కుమార్ పాల్గొన్నారు.

అరటి గెలల లారీ నుంచి జారిపడి వ్యక్తి మృతి

తెనాలి క్రైం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): అరటి గెలల లోడుతో వెళుతున్న లారీ నుంచి జారి పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన అంగలకుదురు వద్ద జరిగింది. స్థానికుల సమాచారం ప్రకారం, గుడివాడకు చెందిన కలదుర్గి వెంకయ్య (43) మంగళవారం తెనాలికి అరటి గెలల లోడుతో వస్తున్న లారీపైన ఎక్కి వస్తుండగా అంగలకుదురు వద్దకు రాగానే అదుపు తప్పి లారీపై నుంచి కింద పడ్డాడు. తలకు తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మృతిపై పూర్తి సమాచారం అందాల్సి ఉందని రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు.

గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లు

గుంటూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఈ నెల 12,15వ తేదీల్లో గుంటూరు మీదుగా రెండు ప్రత్యేక రైళ్లను నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో ఏ.శ్రీధర్ ఒక ప్రకటనలో తెలిపారు. రైలు నంబరు 07455 నర్సాపూర్-సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 12వ తేదీన గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల, నడికుడి మీదుగా ప్రయాణిస్తుందన్నారు. అలాగే రైలు నంబరు 07179 అనకాపల్లి-సికింద్రాబాద్ స్పెషల్ ఈ నెల 15వ తేదీన గుంటూరు, సత్తెనపల్లి, పిడుగురాళ్ల మీదుగా నడుస్తుందని తెలిపారు.

బాపట్ల వార్తలు

◆ బాపట్ల ◆ వేమూరు ◆ రేపల్లె



మనోబంధు ఫౌండేషన్ పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తదితరులు

మనోబంధుకు పోలీసు పూర్తి సహకారం అందిస్తుంది : ఎస్పీ

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మనోబంధుకు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తెలిపారు. మానసిక రుగ్మతలతో బాధపడుతూ వీధులలో నిరాశ్రయులుగా సంచరించే వారిని గుర్తించి వారికి వైద్య సేవలందించి అనంతరం కుటుంబసభ్యులకు అప్పగించే సేవా కార్యక్రమాన్ని మనోబంధ్ స్వచ్ఛంద సంస్థ చేపట్టటం జరిగిందని ఎస్పీ తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయంలో దీనికి సంబంధించిన పోస్టర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. గత నెల 23 నుంచి ఈనెల 18వ తేదీ వరకు కొనసాగనున్న ఈ రెస్క్యూ డ్రైవ్‌కు జిల్లా పోలీసు యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తుందని తెలిపారు. ప్రతి పోలీసుస్టేషన్ పరిధిలో ఇలాంటి మానసిక రోగులు గురించి సమాచారం ఉంటే వెంటనే మనోబంధు సంస్థకు అందించటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మనోబంధు ప్రతినిధులు బాలసురేష్, నారాయణ, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బీఎస్ నారాయణభట్టు, ఫోరం ఫర్ బెటర్‌బాపట్ల కార్యదర్శి డాక్టర్ పీసీ సాయిబాబు, జీవీ, నరసింహారావు, రమణకుమార్, వెంకన్నబాబు, ఇమానీయేలు, ప్రసాద్ పాల్గొన్నారు.

బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో వర్క్‌షాపు ప్రారంభం

బాపట్లరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల సైబర్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్స్ వర్క్‌షాపును సోమవారం సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించగా ఈ కార్యక్రమాన్ని బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇలాంటి వర్క్‌షాపుల ద్వారా సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని తెలిపారు. వైస్‌ప్రెసిడెంట్-2 పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ సైబర్ సెక్యూరిటీ వంటి రంగాలలో ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు అనుభవాన్ని పెంచుతాయన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.రమాదేవి మాట్లాడుతూ విద్యార్థులు సైబర్ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ అండ్ డిజిటల్ ఫోరెన్సిక్ రంగాలలో ప్రావీణ్యం సంపాదించటం అత్యంత అవసరమని తెలిపారు. ఈ వర్క్‌షాపునకు విజయవాడకు చెందిన సుప్రజ టెక్నాలజీస్ సంస్థ నుంచి కె.కుమార్, టీమ్‌సభ్యులు రీసోర్స్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్నారని చెప్పారు.



వర్క్‌షాపు పోస్టర్‌లను ఆవిష్కరిస్తున్న బాపట్ల ఎడ్యుకేషన్ సొసైటీ అధ్యక్షుడు ముప్పలనేని శ్రీనివాసరావు తదితరులు

పైపులకు లీక్‌లు.. అధికారుల పాట్లు

● పట్టణ ప్రజలకు ఇక్కట్లు



బాపట్ల గడియార స్తంభం సెంటర్‌లో జీబీసీ రోడ్డుపై తాగునీటి పైపులైన్ మరమ్మతులకు తవ్వుతున్న గుంత

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో తాగునీటి పైపులైన్‌ల లీక్‌లు పరిపాటిగా మారింది. పడినచోటే మరలా పడుతూ.... మరమ్మతులు చేసినచోటే మరలా లీక్‌లు ఏర్పడుతూ తవ్వినచోటే తవ్వుతూ అధికారులు నానా పాట్లు పడుతున్నారు. బాపట్ల గడియార స్తంభం సెంటర్‌లో ఇప్పటికి 10సార్లకు పైగా పైపులైన్‌లకు లీక్‌లు ఏర్పడి మరమ్మతులు చేయటం జరిగింది. అయినప్పటికి మరలామరలా అదేప్రాంతంలో లీక్‌లు ఏర్పడి తాగునీరు బయటకు వస్తున్నది. రోడ్డును చీల్చుకొని తాగునీరు బయటకు రావటం వల్ల అక్కడ గుంత తవ్వి పైపుకు మరమ్మతులు చేసి రోడ్డును తాత్కాలికంగా పూడ్చి ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. గత నెలలో రెండుసార్లు మరమ్మతులు చేశారు. మరలా లీక్‌లు సరిచేయటం కోసం మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ శ్రీనివాసరావులు సిబ్బందితో కలిసి మరమ్మతు పనులు చేయిస్తున్నారు. ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు లభిస్తుందని పట్టణ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బాపట్ల యువ శాస్త్రవేత్తకు అబుల్‌కలాం ఆజాద్ అవార్డు

కర్లపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కర్లపాలెం మండల కేంద్రానికి చెందిన యువ శాస్త్రవేత్త డాక్టర్ ఎండీ ముజేరుద్దీన్‌బేగ్‌కు అబుల్‌కలాం ఆజాద్ అవార్డు లభించింది. విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీలో ఆజాద్ 137వ జయంతి సందర్భంగా ఆజాద్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఖాజా రహ్మతుల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో యువశాస్త్రవేత్తకు అవార్డును మాజీ ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, వైజాగ్ ఎంపీ భరత్, ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, హైకోర్టు న్యాయవాది ఐఎం అహ్మద్ చేతుల మీదగా అవార్డును అందజేసి ఘనంగా సత్కరించి సన్మానించారు.

యువతలో స్ఫూర్తిని నింపనున్న ఐక్యతా పాదయాత్ర

● మై భారత్ ఉమ్మడి జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయిదేవిరెడ్డి

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సర్దార్ 150 ఐక్యతా పాదయాత్ర యువతలో స్ఫూర్తి నింపనుందని మై భారత్ ఉమ్మడి గుంటూరు జిల్లా ఉప సంచాలకులు కిరణ్మయిదేవిరెడ్డి అన్నారు. ఈ విషయమై మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కిరణ్మయి మాట్లాడుతూ విభజిత భారతదేశాన్ని ఐక్యత సూత్రంతో ఏక్‌భారత్-ఆత్మనిర్భర్‌భారత్ నినాదంతో భారతదేశం ఏకతాటిపై నిలబడేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ కార్యక్రమాన్ని రూపొందించారన్నారు. ఈనెల 13వ తేదీ ఉదయం 9.30 గంటలకు బాపట్ల మున్సిపల్ హైస్కూల్ దగ్గర నుంచి అంబేద్కర్ సర్కిల్ వరకు పాదయాత్ర నిర్వహించి అక్కడ మానవహారం ఏర్పాటు చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం భారత్ ఐరన్‌మెన్‌గా పేరుగాంచిన సర్దార్‌వల్లభాయ్‌పటేల్ 150వ జయంతి పురస్కరించుకొని ఆయన జాతిఐక్యతకు చేసిన అద్భుతమైన కృషికి స్మారకంగా నిర్వహించబడుతుందని తెలిపారు. ఈ సమావేశంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కొత్రా వెంకటరామకృష్ణ, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కిరణ్మయిదేవిరెడ్డి

కల్తీ నెయ్యి కొనుగోలు ద్రోహం సుబ్బారెడ్డిదే : కొల్లా

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : తిరుమల తిరుపతి దేవస్థానానికి చైర్మన్‌గా వైవీ సుబ్బారెడ్డి ఉన్నప్పుడు సరఫరా చేసిన నెయ్యి మైసూర్‌లోని సీఎఫ్‌టీఆర్ఐ ల్యాబ్‌లో కల్తీదిగా నిర్ధారించబడిన తర్వాత కూడా నెయ్యి సరఫరా చేసిన డెయిరీల మీద చర్యలు తీసుకోలేదని సంగం డెయిరీ మాజీ చైర్మన్ కొల్లా వీరయ్యచౌదరి అన్నారు. కల్తీ నెయ్యి కొనుగోలును కొనసాగించటం వెనుక ఉన్న కుట్ర ఎవరిదో అప్పటి చైర్మన్ సుబ్బారెడ్డి చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

14 నుంచి జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు

పిట్టలవానిపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పిట్టలవానిపాలెం శాఖా గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఈనెల 14 నుంచి 20వ తేదీ వరకు జరుగుతాయని గ్రంథాలయాధికారి డాక్టర్ మోర్ల శ్రీనివాసరావు తెలిపారు. ఈ సందర్భంగా 14న గ్రంథాలయ వారోత్సవాల ప్రారంభ వేడుకలను, బాలల దినోత్సవం, 15న పుస్తక ప్రదర్శన, 16న గ్రంథాలయ ఉద్యమంలో పాల్గొన్న ప్రముఖులను స్మరించుట, 17న కవిసమ్మేళనం, రచయితల సందేశాలు, 18న విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, క్విజ్, క్రీడలు పోటీలు, 19న మహిళా దినోత్సవం సందర్భంగా ముగ్గుల పోటీలు, 20న వారోత్సవాల ముగింపుసభ, విజేతలకు బహుమతి ప్రధానోత్సవం జరుగుతాయన్నారు. మండలంలోని మంతెనవారిపాలెం, చందోలు, ఖాజీపాలెం గ్రంథాలయాలలో వారోత్సవాలు జరుగుతాయని ఆయా గ్రంథాలయాధికారులు తెలిపారు

గృహప్రవేశాలు వేడుకగా జరపాలి

● కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ లేఅవుట్‌లలో లబ్ధిదారులు నిర్మించుకున్న గృహప్రవేశాలు వేడుకగా జరపాలని కలెక్టర్ డాక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై సంబంధిత శాఖల జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 3 లక్షల ఇళ్ళు ఒకేరోజు గృహప్రవేశాలు జరుగుతున్న నేపథ్యంలో జిల్లాలోని ఆరు నియోజకవర్గాలలో వేడుకలు జరుగుతాయని కలెక్టర్ చెప్పారు. ఈ కార్యక్రమాలలో ప్రజాప్రతినిధులు హాజరు కావాలని కోరారు. తీరప్రాంతాలలోని ప్రతి గృహానికి వ్యక్తిగత మరుగుదొడ్లు ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాకు మంజూరైన 46 సామాజిక మరుగుదొడ్లు వేగంగా నిర్మించాలన్నారు. పట్టణ ప్రాంతాలలో సామాజిక మరుగుదొడ్ల అవసరతను గుర్తించి తక్షణమే నివేదిక ఇవ్వాలన్నారు. చెత్త సంపద కేంద్రాల నిర్వాహణ సమర్థంగా ఉండాలన్నారు. తాగునీటి సరఫరాలో క్రమం తప్పకుండా క్లోరినేషన్ జరగాలన్నారు. అన్నక్యాంటీన్‌ల ద్వారా ప్రజలకు నాణ్యమైన ఆహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన కింద మంజూరైన పనులను అధికారులు రెండువారాలలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో గృహనిర్మాణశాఖ పీడీ వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ అనంతరాజు, ఎస్సీ సంక్షేమ సాధికారిత అధికారిణి జె.రాజదెబోరా, డిఎల్‌డిఓ పద్మ, సచివాలయాల జిల్లా కోఆర్డినేటర్ యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



కేక్ కట్ చేస్తున్న మహేంద్రభాస్కరరావు తదితరులు

విశేష సేవలందిస్తున్న యూనియన్ బ్యాంక్

● మెండు మహేంద్రభాస్కరరావు

కర్లపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : భారతదేశంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశవ్యాప్తంగా 1919వ సంవత్సరంలో నాలుగు బ్రాంచ్‌లతో ప్రారంభమై 8,621 బ్రాంచ్‌లకు విస్తరించిందని, 8,910 ఏటీఎంలతో ఖాతాదారులకు విశేష సేవలదిస్తుందని ఆల్ ఇండియా యూనియన్ బ్యాంక్ ఆఫీసర్స్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరి మెండు మహేంద్రభాస్కరరావు అన్నారు. యూనియన్ బ్యాంక్ కర్లపాలెం శాఖలో 107వ ఫౌండేషన్ దినోత్సవంలో మంగళవారం మేనేజర్ కె.మానస ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కేక్‌కట్ చేసి వేడుకలు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు గుండ్రెడ్డి శివ, డిప్యూటీ మేనేజర్ స్రవంతి, సిబ్బంది శ్రీనివాసరావు, భానుఅనీషా, సందీప్, జగదీష్‌కుమార్, మహేష్, గోపి, జనక మహారాజ్, ప్రసాద్, జ్యోతి, బ్యాంక్ మిత్రాలు పాల్గొన్నారు.

అక్షర విద్యాభవన్‌లో ఉచిత నేత్ర వైద్యశిబిరం

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అక్షరవిద్యాభవన్‌లో మంగళవారం ఉచిత నేత్ర వైద్యశిబిరం నిర్వహించారు. ప్రముఖ నేత్రవైద్యులు డాక్టర్ కార్యంపూడి వెంకటేశ్వర్లు సిబ్బంది రాజేష్, ఇందిరలతో కలిసి విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. సెంటిన్ ఫార్మాస్యూటికల్ కంపెనీ సౌజన్యంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వెంకటనారాయణ, జగదీష్ పాల్గొన్నారు. విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. అనంతరం డాక్టర్ వెంకటేశ్వర్లును కరస్పాండెంట్ శ్రీనివాసరాజు సిబ్బందితో కలిసి సన్మానించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రత్నమాల, పుష్పలత పాల్గొన్నారు.

ఉగ్రవాదులు బాంబుపేలుళ్ళకు పాల్పడటం అమానుషం

పిట్టలవానిపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఎర్రకోట దగ్గరలో జరిగిన బాంబు పేలుళ్ళల్లో అమాయక ప్రజలు ప్రాణాలు కోల్పోవటం ఎంతో దురదృష్టకరమని బీజేపీ మండల నాయకులు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ అధికారం చేపట్టాక 11 ఏళ్ళ పాలనలో భారతదేశంలో ఎక్కడా ఇలాంటి అమానుషచర్యలు జరగలేదని ఇటువంటి చర్యలను నాయకులు తీవ్రంగా ఖండించారు. బీజేపీ మండల అధ్యక్షులు అక్కల రామిరెడ్డి, చందోలు లింగోద్భవ దేవస్థానం చైర్మన్, మండల బీజేపీ మాజీ అధ్యక్షులు పరిమి రామకృష్ణ సాయిబాబు, బీజేపీ నాయకులు తోటకూర శ్రీనివాసరావు, బీజేపీ నాయకులు పరుశురామయ్య, బృందావనం గోపిచంద్, ఆర్.రాము పాల్గొన్నారు.

వైసీపీ అసత్య ప్రచారాలు నమ్మవద్దు

● బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది



మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతంలో మాట్లాడుతున్న బంగారుబాబు, కూటమి నాయకులు

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ అసత్య ప్రచారాలు ప్రజలు నమ్మవద్దని, పీపీపీ విధానంలో మెడికల్ కళాశాల నిర్మాణమే మంచిదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొండమూది బంగారుబాబు అన్నారు. కూటమి నాయకులతో కలిసి మంగళవారం ఆయన బాపట్ల మెడికల్ కళాశాల నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించారు. అయన మాట్లాడుతూ 17 మెడికల్ కాలేజిలలో ఏ కాలేజి గత ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. నిధుల కొరత వల్లే పీపీపీ విధానానికి వెళ్ళటం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, కూచిపూడి శ్యామ్‌సుందర్, కార్పొరేషన్ డైరెక్టర్‌లు మందపాటి ఆంధ్రేయ, చాప సోమయ్య, బీజేపీ నాయకులు కొత్రా వెంకటరామకృష్ణ, షేక్ కరీముల్లా, బూర్లె రత్తయ్య, చిల్లా సత్యనారాయణ, శీలం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు సీఫార్డ్ సంస్థ చేయూత

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : సొసైటీ ఫర్ ఇంటిగ్రేటెడ్ రూరల్ డెవపల్‌మెంట్ స్వచ్ఛంద సేవాసంస్థ ఆధ్వర్యంలో అమెజాన్-డోనేట్‌కార్ట్ హైదరాబాద్‌వారి సహకారంతో సూర్యలంక సముద్ర తీర ప్రాంతంలోని మత్స్యకారులకు, కర్లపాలెం మండలం చింతాయపాలెం రోడ్డు పక్కనే నివసిస్తున్న యానాది కుటుంబాలకు మంగళవారం నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. కార్యక్రమానికి సీఫార్డ్ డైరెక్టర్ కొమరబత్తిన రవిప్రదీప్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తుఫాన్ ప్రభావిత బాధితులకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు బడుగు కిషోర్, మర్రిపల్లి నాగరాజు, రామకృష్ణ, దేవయ్య, జ్యోతి పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ ప్రజా ఉద్యమం

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వైసీపీ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడుతున్నట్లు ఆపార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగ నాగార్జున అన్నారు. పార్టీశ్రేణులతో కలిసి బాపట్ల వైసీపీ కార్యాలయంలో మంగళవారం ప్రజా ఉద్యమం, కోటిసంతకాల సేకరణ పోస్టర్‌ను అవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కోన రఘుపతి, రేపల్లె ఇన్‌చార్జి డాక్టర్ ఈవూరి గణేష్, పట్టణ పార్టీ అధ్యక్షులు కాగిత సుధీర్‌బాబు, ఎంపీపీ హరిబాబు, మండల పార్టీ అధ్యక్షుడు ఎం.ఏడుకొండలురెడ్డి, జిల్లా కార్యదర్శి నక్కా వీరారెడ్డి, ఇనగలూరి మాల్యాద్రి, ఇమ్మడిశెట్టి శ్రీనివాసరావు, అడే క్యాత్రిన్ రాజు, సోహిత్, గొర్రెముచ్చు పుష్పరాజ్యం, పిన్నిబోయిన ప్రసాద్, వడ్డిముక్కల డేవిడ్, విభజనం విభాగం నాయకులు పాల్గొన్నారు.

ఉద్యమస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలి



ఆజాద్ పటానికి పుష్పాంజలి ఘటిస్తున్న అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్

బాపట్ల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మహనీయుల స్వాతంత్ర్య ఉద్యమస్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని అబ్దుల్ కలాం ఫౌండేషన్ చైర్మన్ పఠాన్ రాజేష్ తెలిపారు. ఆజాద్ జయంతి కార్యక్రమాన్ని ఎంపీ తెన్నేటి కృష్ణ ప్రసాద్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. అజాద్ పటానికి నాయకులతోపాటు పుష్పాంజలి ఘటించి ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కత్తి దానియేలు, పాపారావు, మద్దాల పాపయ్య, డి.రాము, నర్రా సాంబు, గవిని ప్రసాద్, కె.కొండలు, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్ సేవలు అభినందనీయం

రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణాన్ని స్వచ్ఛ రేపల్లెగా తీర్చిదిద్దేందుకు శానిటరీ ఇన్‌స్పెక్టర్ చేసిన సేవలు అభినందనీయమని మున్సిపల్ కమిషనర్ కె.సాంబశివరావు అన్నారు. స్థానిక కార్యాలయంలో పనిచేసి పదోన్నతిపై రాజాం మున్సిపాలిటీకి కమిషనర్‌గా వెళుతున్న సందర్భంగా మంగళవారం మున్సిపల్ కార్మికులు, ఏఐటీయూసీ ఉద్యోగులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు అభినందన సభ నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ పురపాలకసంఘంలో రామచంద్రరావు అంకితభావంతో విధులు నిర్వహించారన్నారు. రేపల్లె పట్టణ సీపీఐ నాయకులు కన్నెగంటి రమేష్ మాట్లాడుతూ పురపాలకసంఘంలో శానిటరీ పరిపాలన విభాగంలో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దిన ఘనత రామచంద్రరావుదేనన్నారు. అనంతరం ఆయనను పూలమాలలు, దుశ్శాలువాలతో సన్మానించారు. రేపల్లె పట్టణ ఆర్యవైశ్య సంఘం తరుపున రామచంద్రరావుకు అభినందనలు తెలిపి దుశ్శాలువా, పూలమాలలతో నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జొన్నలగడ్డ సుబ్రహ్మణ్యం, ఆర్యవైశ్య నాయకులు సుగ్గుల సుదర్శన్, ప్రజా సంఘాల నాయకులు వై.కిషోర్, సింగంవాణి, షేక్ మొహీద్దీన్ పాల్గొన్నారు.

పుస్తక ప్రచురణ అభినందనీయం : బుచ్చయ్యచౌదరి

నగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్నేషనల్ స్థాయిలో పుస్తకాన్ని పబ్లిష్ చేసే అధ్యాపకులు కళాశాలలో పని చేయటం గర్వంగా ఉందని ఎస్వీఆర్ఎం కళాశాల కరస్పాండెంట్ సెక్రటరీ వల్లభనేని బుచ్చయ్యచౌదరి అన్నారు. వెలగపూడి రామకృష్ణ స్మారక కళాశాలలో ఎసెన్షియల్ ఆర్గానిక్ ట్రాన్స్‌ఫర్మేషన్ బుక్ ఓపెనింగ్ కార్యక్రమం మంగళవారం బుచ్చయ్యచౌదరి చేతులమీదగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుచ్చయ్యచౌదరి మాట్లాడుతూ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు ప్రసన్నబాబును అభినందిస్తూ ఇంటర్నేషనల్ స్థాయిలో పుస్తకం పబ్లిష్ చేయడం అభినందదాయకమని, ఇంకా మరిన్ని బుక్స్ పబ్లిష్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, ఆర్‌టీఈఐ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ నర్రా కృష్ణప్రసాద్, పి.శ్రీనివాసరావు, కళాశాల సూపరింటెండెంట్ అమరేష్‌రెడ్డి, కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

అనుమతులు లేని లేఅవుట్‌లు ధ్వంసం

కొల్లూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : అనుమతులు లేకుండా వేసిన లేఅవుట్‌ను సీఆర్‌డీఏ అధికారులు ధ్వంసం చేశారు. కొల్లూరులోని బొద్దులూరుపాడు వెళ్లే రోడ్డులో 2.95 ఎకరాలలో అనధికారికంగా ప్లాట్లు, రోడ్లు వేసి లేఅవుట్‌ను మంగళవారం తెనాలి జోన్ సీఆర్‌డీఏ టీపీవో సుబ్బారావు, టీపీఏలు వెంకటేష్, స్టాలిన్ పరిశీలన చేశారు. అనుమతులు లేకుండా ప్లాట్లు వేయడంతో అక్కడ పాతిన రాళ్లు, రోడ్లను యంత్ర సహాయంతో తొలగించారు. సీఆర్‌డీఏ అనుమతులు తీసుకోకుండా ప్లాట్లు వేస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఎల్ఆర్ఎస్ కింద దరఖాస్తు చేసుకుని తగిన రుసుం చెల్లిస్తే అనుమతులు వస్తాయని తెలిపారు. లేఅవుట్ ధ్వంసంలో కొల్లూరు పంచాయతీ కార్యదర్శి శంకరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుయువత మండల అధ్యక్షుడిగా ఆనంద్



ఆనంద్

బాపట్లరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బాపట్ల మండల తెలుగుయువత అధ్యక్షుడిగా మార్పు ఆనంద్‌ను నియమించారు. ఎమ్మెల్యే నరేంద్రవర్మ ఆశీస్సులతో ఈపదవీ ఇవ్వటం జరిగిందని ఆనంద్ తెలిపారు. 32, 33 వార్డుల టీడీపీ ప్రెసిడెంట్‌లు అడే వంశీ, ఐనంపూడి షాలెంరాజు శుభాకాంక్షలు తెలిపారు.

గ్యాస్ సిలిండర్ పేలి మహిళకు గాయాలు

కర్లపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని యాజలి పంచాయతీలోని పుట్టలమ్మ తల్లి దేవాలయం సమీపంలో నివశిస్తున్న అంకమ్మ అనే మహిళ మంగళవారం గ్యాస్ స్టౌవ్ వెలిగిస్తుండగా గ్యాస్ బండ పేలి మంటలు వ్యాపించి గాయాలయ్యాయి గాయపడిన అంకమ్మను బాపట్ల ఏరియా వైద్యశాలకు తరలించారు.

బస్సు డ్రైవర్‌పై దాడి

బాపట్లరూరల్, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : బస్సు డ్రైవర్‌పై ఇద్దరు వ్యక్తులు కర్రతో దాడి చేసిన ఘటన సోమవారం రాత్రి జరిగింది. బాపట్ల రూరల్ సీఐ శ్రీనివాసరావు కథనం మేరకు మండలంలోని కంకటపాలెం గ్రామానికి చెందిన అనిల్‌చౌదరి బాపట్ల ఇంజనీరింగ్ కళాశాలలో బస్సు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. సోమవారం రాత్రి డ్యూటీ దిగి ఇంటికి వెళుతుండగా మార్గమధ్యంలో ఇద్దరు యువకులు ద్విచక్ర వాహనంపై వచ్చి అనిల్‌చౌదరిపై కర్రతో దాడి చేశారు. ఈ ఘటనలో తలకు గాయమవ్వటంతో బాధితుడు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు : సీఐ

బాపట్ల, పిట్టలవానిపాలెం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పాతబస్టాండ్, గడియారస్తంభం ప్రధాన కూడళ్ళల్లో ద్విచక్రవాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై మంగళవారం పట్టణ సీఐ ఆర్.రాంబాబు పలుసూచనలు చేశారు. కార్యక్రమంలో ఎస్సై విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అదేవిధంగా మహిళా ఎస్ఐ చంద్రావతి పాతబస్టాండ్ కూడలిలో వాహనాలు తనిఖీ చేశారు. అలాగే చందోలు పోలీసుస్టేషన్ పరిధిలో వాహనాలను చందోలు ఎస్ఐ మర్రి వెంకటశివకుమార్ తనిఖీ చేశారు.



కార్యక్రమంలో రైతులకు సూచనలిస్తున్న రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మి

రైతు సేవా కేంద్రాల ద్వారానే ధాన్యాన్ని అమ్ముకోవాలి

● రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు లక్ష్మి

నగరం, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు దళారులను నమ్మి మోసపోకుండా రైతుసేవాకేంద్రాల ద్వారానే ధాన్యాన్ని అమ్ముకోవాలని, ప్రతి రైతు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకే తమ ధాన్యాన్ని రైతు సేవా కేంద్రాల ద్వారా అమ్ముకోవాలని రేపల్లె సహాయ వ్యవసాయ సంచాలకులు ఎ.లక్ష్మి అన్నారు. ఏలేటిపాలెం రైతుసేవాకేంద్రం పరిధిలో మంగళవారం పొలంపిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంట ఉన్న దశనుబట్టి పాటించాల్సిన సస్యరక్షణ చర్యలను గురించి వివరించారు. అలానే మండల వ్యవసాయ అధికారి వి.రమేష్‌బాబు మాట్లాడుతూ సరైన సమయంలో పురుగుమందులు, తెగులు మందులు పిచికారి చేయటం ద్వారా అధిక దిగుబడి సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి కె.నాగశ్రీనివాసరావు, గ్రామ ఉద్యానవన సహాయకురాలు బి.జయవర్థిని, గ్రామవ్యవసాయ సహాయకుడు పి.చైతన్య, గ్రామ రైతులు పాల్గొన్నారు.

అరవపల్లి, నల్లూరు గ్రామాల్లో...

రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రైతులు ప్రభుత్వం అందించే వివిధ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ శాఖ ఏవో మహేష్‌బాబు అన్నారు. అరవపల్లి, నల్లూరు గ్రామాల్లో మంగళవారం పొలంపిలుస్తోంది కార్యక్రమం నిర్వహించి పంట దిగుబడులపై రైతులకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ రైతులు విశిష్టసంఖ్య నమోదు చేసుకోవాలని సూచించారు. పీఎం కిసాన్‌కు సంబంధించిన 185 మంది రైతులు అర్హత పొందారన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవో సుమన్, లక్ష్మణసాయి, సుధీర్ పాల్గొన్నారు.

చిక్కీలో పురుగులపై విద్యాశాఖాధికారుల విచారణ



విచారణ చేస్తున్న విద్యాశాఖాధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చుండూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఆలపాడు ప్రాథమిక పాఠశాలలో చిక్కీ ప్యాకెట్లలో పురుగులు రావడంపై మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనానికి జిల్లా, మండల అధికారులు స్పందించారు. ఉదయం పాఠశాలకు చేరుకున్న అధికారులు పంపిణీ కోసం సరఫరా అయిన ప్యాకెట్లను పరిశీలించగా కొన్ని చిక్కీ ప్యాకెట్స్ గడువు తేదీ ఈ నెల వరకు మాత్రమే ఉంది. పంపిణీకి సిద్ధం చేసిన 80 ప్యాకెట్స్‌లో కొన్నింటిలో పురుగులు ఉండటాన్ని అధికారులు గుర్తించారు. విచారణలో పాల్గొన్న విద్యార్థుల తల్లిదండ్రులు ఇది ప్యాకింగ్ సమయంలో జరిగిన లోపం అయి ఉంటుందని ఈ విషయాన్ని ఉన్నత స్థాయి అధికారులకు తెలిపాలని ఎంఈవో సులోమాన్‌ను తల్లిదండ్రులు కోరారు.

నేడు టీడీపీ కమిటీల ప్రమాణ స్వీకారోత్సవం

వేమూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : టీడీపీ వివిధ విభాగాల కమిటీల ప్రమాణ స్వీకారోత్సవాన్ని బుధవారం సాయంత్రం 4.30 గంటలకు నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని ఎన్టీఆర్ పురవేదిక వద్ద నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గం తెలిపింది. ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు ముఖ్యఅతిథిగా విచ్చేసి మండల క్లష్టర్ యూనిట్ విలేజ్, బూత్ కమిటీల సభ్యులు చేత ప్రమాణ స్వీకారం చేయిస్తారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. నియోజకవర్గ పరిధిలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు, సంబంధిత కమిటీ సభ్యులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

పశువులకు వైద్యపరీక్షలు

రేపల్లె, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : పాడిరైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్తి స్థాయిలో వైద్యపరీక్షలు అందించి మందులను పంపిణీ చేస్తున్నామని పశుసంవర్థకశాఖ ఏడీ డాక్టర్ బెల్లంకొండ నాంచారయ్య అన్నారు. మండలంలోని విశ్వేశ్వరం గ్రామంలో గోకుల్‌మిషన్‌లో భాగంగా ఏపీఎల్‌డీఏ సహకారంతో మంగళవారం పశువులకు ఉచిత ఫర్టిలిటి(గైనిక్)శిబిరం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 32 పాడి రైతులకు సంబంధించిన 94 పశువులను పరీక్షించి గర్భకోశ సంబంధిత కేసులలో 52 పశువులకు ఉచితంగా మందులను పంపిణీ చేయటం జరిగిందని తెలిపారు. తిరగగట్టే పశువులను డేటా సేకరించి వాటికి కావాల్సిన మందులను అందించారు. ఈ కార్యక్రమంలో పశువైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్‌కుమార్, కరిముల్లా, మీనాక్షిదేవి, హేమప్రియ, దేవవర్ధన్, వంశీ, సత్య, మాజీసర్పంచ్ బాలభాస్కర్ తదితరులు పాల్గొన్నారు.



పాడి రైతులకు ఉచితంగా మందులు అందిస్తున్న డాక్టర్ నాంచారయ్య తదితరులు

నేడు విరలేశ్వర ఆలయంలో లక్ష బిల్వార్చన

భట్టిప్రోలు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : విరలేశ్వర స్వామి ఆలయంలో లక్ష బిల్వార్చన కార్యక్రమం బుధవారం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు మంగళవారం తెలిపారు. స్థానిక గంగాపార్వతీ సమేత విరలేశ్వరస్వామి ఆలయంలో కార్తీక మాసం పురస్కరించుకుని స్వామి వారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, లక్ష బిల్వార్చన, కుంకుమార్చన, జ్యోతిర్లింగార్చన కార్యక్రమాలు జరుగుతాయన్నారు. రాత్రి వేళ కార్తీక వన సమారాధన నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా హాజరవుతారని దేవదాయ శాఖ అధికారి శ్రీనివాసరావు పేర్కొన్నారు.

పశువులకు నేడు ఉచిత వైద్య శిబిరం

చెరుకుపల్లి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ, పశు సంవర్థకశాఖ సంయుక్త ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల ఉచిత శిబిరం రాజోలు గ్రామంలోని పాలకేంద్రం ఆవరణలో బుధవారం నిర్వహించబడుతుందని గూడవల్లి పశువైద్యాధికారిణి డాక్టర్ బొలగాని జ్యోత్స్న తెలిపారు. రాజోలు గ్రామపశుపోషకులు ఈశిబిరాన్ని ఉపయోగించుకోవాల్సిందిగా కోరారు.

శింగరకొండ దేవస్థానానికి విరాళం



విరాళం అందజేస్తున్న వెంకటరత్నం, నాగేశ్వరరావు దంపతులు

అద్దంకి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండప నిర్మాణానికి ధర్మకర్తల మండలి సభ్యురాలు ధూళిపాళ్ల వెంకటరత్నం, నాగేశ్వరరావు దంపతులు మంగళవారం రూ.1,01,116లను అసిస్టెంట్ కమిషనర్ ఈఓ తిమ్మానాయుడుకు అందజేశారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరరావు, నూతి ప్రసాద్, శైలజ, అనూరాధ, కల్యాణి తదితరులు పాల్గొన్నారు. వెంకటరత్నం, నాగేశ్వరరావు దంపతులను ప్రత్యేక పూజల అనంతరం పూజారులు ఆశీర్వదించారు.

రీసర్వేలో లోపాలను సరిచేసేందుకే గ్రామసభలు



మాట్లాడుతున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రీసర్వేలో జరిగిన పొరపాట్లను సరిచేసేందుకు అన్ని గ్రామాలలో గ్రామసభలను నిర్వహిస్తున్నామని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రవినాయక్ పేర్కొన్నారు. మంగళవారం బల్లికురవ సచివాలయంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రభుత్వం జాయిం ట్ ఎల్‌పీఎంలను సరిచేసేందుకు రైతులు రూ.50 చలనా చెల్లిస్తే వెంటనే వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఈ అవ కాశం అందుబాటులో ఉంటుందన్నారు. బల్లికురవ గ్రామంలో 22 మంది రైతులు జాయింట్ ఎల్‌పీలపై అర్జీలను గ్రామసభలో అందించారు. కార్యక్రమంలో సర్వేయర్ సత్యనారాయణ, వీఆర్వో అశోక్ పాల్గొన్నారు.

భాస్వరం వినియోగంతో మొక్కలకు మేలు



గోవాడలో వరి పొలాలు పరిశీలిస్తున్న ఏడీఏ ఎర్రాయం

అద్దంకి, నవంబరు11(ఆంధ్రజ్యోతి): భాస్వరం ఎరువుల వినియోగం వలన మొక్కలకు సూక్ష్మపోషకాలు లభిస్తాయని ఏడీఏ ఎర్రాయం అన్నారు. మండలంలోని చినకొత్తపల్లి, గోవాడ లలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వరి పొలాలను పరిశీలించి డీఏపీ ఎరువులు అధికంగా వినియోగించడం ద్వారా భూమి నుంచి సహజంగా అందే సూక్ష్మపోషకాలు అందకుండా పోతున్నాయన్నారు. రైతులు రెండు, మూడు దఫాలు భాస్వరం ఎరువులు వినియోగిస్తే ఖర్చులు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో ఏవో కొర్రపాటి వెంకటకృష్ణ, ఉద్యానవన సహాయకురాలు శ్రీలక్ష్మీ, వ్యవసాయ విస్తరణ అధికారి కోటేశ్వరరావు, ఆత్మ బ్లాక్ టెక్నాలజీ మేనేజర్ శేషారావు, పుట్టా సాంబశివరావు, నరిశెట్టి వీరాంజనేయులు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించిన ఫుడ్ కమిషన్ సభ్యురాలు

చినగంజాం, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని సంతరావూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రం-1ని ఏ.పీ రాష్ట్ర ఫుడ్ కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి మంగళవారం పరిశీలించారు. అంగన్‌కేంద్రంలోని చిన్నారులకు మధ్యాహ్న భోజనం పెట్టినారని అంగన్‌వాడీ కార్యకర్త దనలక్ష్మిని ఆమె అడిగారు. ఆయా మెడికల్ లీవులో ఉన్నందున, కేంద్రంలోని ఇద్దరు చిన్నారులకు తానే భోజనం పెట్టినానని అంగన్‌వాడీ కార్యకర్త తెలిపారు. అండన్‌వాడీ కేంద్రంలోని వంట పాత్రలను ఆమె పరిశీలించారు. కార్యకర్త పని తీరు పట్ల రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబరు అసం తృప్తి వ్యక్తం చేశారు. అంగన్ వాడీ కేంద్రాల్లోని చిన్నారులకు పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో మహిళా సీసీ సంక్షేమ శాఖ పీ.డీ. రాధా మాధవి, సీ.డీ.పీ.వో జి.సులో చనా రాణి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ ఉషాకుమారి తదితరులు పాల్గొన్నారు.



సీ.డీ.పీ.వోతో మాట్లాడుతున్న దేవి

తుఫాన్ బాధితులకు అత్యవసరంగా సాయం అందించండి

కలెక్టర్‌కు వైసీపీ నేతలు వినతిపత్రం

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుఫాన్ బాధితులకు కేంద్రం సాయాన్ని అత్యవసరంగా అందించాలని వైసీపీ పార్టీ జిల్లా అధ్యక్షులు మేరుగ నాగార్జున, బాపట్ల పార్టీ ఇన్‌చార్జీ కోన రఘుపతి, రేపల్లె వైసీపీ ఇన్‌చార్జీ డా.ఈవూరి గణేష్ అన్నారు. చీరాల నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జీ కరణం వెంకటేష్ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ వినోద్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో పలు జిల్లాల్లో వ్యవసాయం, పశు సంపద, ఆక్వా రంగం తీవ్ర నష్టాల బారినపడినట్లు చెప్పారు. అలాగే మత్స్యకార కుటుంబాల పరిస్థితి దైనందంగా ఉన్నట్లు వివరించారు. దాదాపుగా 15 లక్షల ఎకరాలు పంటలు నష్టపోయిన ట్లు వివరించారు. సమస్యను కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి పారదర్శకంగా న్యాయం జరిగేలా చూడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న వైసీపీ నేతలు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ తప్పనిసరి



కౌన్సిలింగ్ ఇస్తున్న ఎస్‌ఐ సురేష్

ఇంకొల్లు, నవంబరు 11,(ఆంధ్రజ్యోతి) : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్సై సురేష సూచించారు. మండలంలోని పూసపాడు అడ్డరోడ్డులో రహదారి భద్రత నియమాలపై వాహనదారులకు మంగళవారం అవగాహన కలిగించారు. అతివేగంతో వాహనాల నడపరాదని, ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రాణహాని జరగకుండా కాపాడుకో వచ్చునన్నారు. ద్విచక్రవాహనాలపై ప్రయాణించే వారే మృత్యువాత పడుతున్నార న్నారు. ప్రతి ఒక్కరు విధిగా హెల్మెట్ ధరించి స్వీయరక్షణ పాటించాలన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మంచి ప్రయాణీకులను ఎక్కించుకోకూడదన్నారు.వాహనాలను నిర్దిష్ట వేగంతో నడపాలన్నారు. కార్యక్రమంలో ఆటోడ్రైవర్లు, ద్విచక్రవాహనదారులకు రోడ్డు బద్రతా నిబంధనలపై అవగాహన కలిగించారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

మార్టూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పట్టణంలో పెద అండర్ పాస్ సమీపంలో విద్యుత్‌లైన్ల మరమ్మత్తుల నిమిత్తం బుధవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలపివేస్తున్నట్లు ఏఈ వీరాంజనేయులు తెలిపారు.

ఉగ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలి



ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఒంగోలు కలెక్టరేట్, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో బాంబుపేలుడుకు పాల్పడిన ఉ గ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ గురునాథ్ డిమాండ్ చేశారు. అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక కోర్టు సెంటర్‌లో ఉగ్రవాదుల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ బాంబు పేలుడుల్లో పలువురు మంది మృతి చెందడం బాధాకరమని, వారి కుటుంబ సభ్యులను ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు నాగచరణ్, త్రినాథ్, సాయిఅఖిల్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల హాస్టల్‌కు ఆర్వోప్లాంట్ వితరణ

చీమకుర్తి, నవంబరు 11(ఆంధ్రజ్యోతి) : చీమకుర్తి పట్టణంలోని ఎస్సీ బాలికల వసతిగృహ విద్యార్థినుల దాహార్తిని తీర్చటానికి లయన్స్ క్లబ్ ఆఫ్ చీమకుర్తి చేయుతనందించింది. ఈ సందర్భంగా దాదాపు రూ.50వేలు విలువ చేసే ఆర్వోప్లాం ట్‌ను మంగళవారం హాస్టల్‌లో జరిగిన కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ ఆఫ్ సూచనతో వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ బి.జవహార్ చేతుల మీదుగా అందజేశారు.గోలి రా మలింగశర్మ జ్ఞాపకార్థం కంటి వైద్యశిబిరం ఏఆర్పటు చేశారు.

మట్టి, జలంతోనే.. మనుగడ

(5వ పేజీ తరువాయి)

వాయిదా వేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు గళ్లా మాధవి, నసీర్‌అహ్మద్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్, జడ్పీ చైర్‌పర్సన్ హెనీక్రిస్టీనా, జీడీసీసీ, డీసీఎంఎస్ చైర్మన్లు మక్కెన మల్లికార్జునరావు, వడ్రాణం హరిబాబు, కార్పొరేషన్ల చైర్మన్లు డేగల ప్రభాకర్, మన్నవ మోహనకృష్ణ, పిల్లి మాణిక్యరావు, డిప్యూటీ మేయర్ షేక్ సజీలా, బీజేపీ, జనసేన జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, గాదె వెంకటేశ్వర్లు, రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎం శశిభూషణ్‌కుమార్, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరి నితిన్‌కడే, గ్రామీణ అభివృద్ధి శాఖ వాటర్ షెడ్ విభాగం సంచాలకులు వై.వి.కె.షణ్ముఖ కుమార్, జాయింట్ కమిషనర్ శివరాం, రాష్ట్ర పంచాయతీ కమిషనర్ కృష్ణతేజ, కలెక్టర్ తమీమ్‌అన్సారియా, ఎస్పీ వకుల్‌జిందాల్, నగర కమిషనర్ పులి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసానికి ప్రశంసలు

కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్ కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రజలకు సేవ చేసేందుకే ఆయన రాజకీయాల్లోకి వచ్చారన్నారు. కొత్తగా రాజకీయాల్లో ప్రవేశించినప్పటికీ ప్రభుత్వ పథకాలపై ఆయన అవగాహన అభినందనీయమని కితాబిచ్చారు. హిందీలో ఆయన మాట్లాడుతుంటే హిందీ మాతృభాష కలిగిన వారికే ఆశ్చర్యం కలుగుతుందన్నారు. నేను కూడా తెలుగు నేర్చుకొని ఈసారి వచ్చినప్పుడు అదే స్థాయిలో తెలుగులో ప్రసంగిస్తానని చెప్పారు. చెరువును సుందరంగా తీర్చిదిద్దిన ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు, అధికారులను అభినందించారు. వాటర్‌షెడ్ మహోత్సవ్‌లో వాటర్‌షెడ్ జన్ భగీరథికప్ 2025 బహుమతులు అందజేశారు.

పరిశ్రమల ఏర్పాటు దిశగా అడుగులు

(5వ పేజీ తరువాయి)

కూడా నిర్మించనున్నారు. పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలను ఆహ్వానించడంతో పాటు కొత్తగా పరిశ్రమల రంగంలోకి అడుగు పెట్టేవారికి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహలను అందించనున్నది. ఇందుకోసం పరిశ్రమలశాఖ ఏర్పాట్లు చేస్తోంది. బ్యాంకుల రుణాలతో పాటు కొన్ని రకాల పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర పభుత్వాలు రాయితీలు కల్పించనున్నాయి. కాగా జిల్లాలో మూడు నియోజకవర్గాల్లో పారిశ్రామికవాడలకు శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో మంగళవారం కనిగిరి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు వర్చువల్‌గా గోవాడ, నాయనిపల్లి, నిజాంపట్నంలో ఎంఎస్‌ఎంఈ పార్కులకు శంకుస్థాపన చేశారు.

వ్యాపారులకు తోడ్పాటు : నిజాంపట్నంలో ఆర్డీవో రామలక్ష్మి

రేపల్లె: వ్యాపారులకు ప్రభుత్వం తోడ్పాటు అందిస్తుందని ఆర్డీవో రామలక్ష్మి తెలిపారు. నిజాంపట్నంలో ఎంఎస్‌ఎంఈ పార్కు శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం జరిగిన సభలో ఆమె ప్రసంగించారు. పారిశ్రామికవాడ ఏర్పాటుకు నాలుగు ఎకరాలు కేటాయించగా, 181 మందికి అవకాశం ఉంటుందన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే ప్లాట్లు కేటాయిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్, కృష్ణా పశ్చిమ డెల్టా పీసీ చైర్మన్ పంతాని మురళీధరరావు, మార్కెట్‌యార్డు చైర్మన్ ఓగిబోయిన వెంకట్‌యాదవ్, ఇన్‌చార్జి తహసీల్దారు మోర్ల శ్రీనివాసరావు, ఏపీఐఐసీ జీఎం వై.రామకృష్ణ, ఎంపీడీవో ఎం.నాగలక్ష్మి, టీడీపీ నాయకులు నర్రా సుబ్బయ్య, బొమ్మిడి రామకృష్ణ, తాతా ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా అంజిరెడ్డి

● ఉత్తర్వులు ఇచ్చిన రాష్ట్ర కమిటీ

ఒంగోలు(విద్య), నవంబరు11(ఆంధ్రజ్యోతి): పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఒంగోలు నగరంలోని త్రోవగుంట జడ్పీ హైస్కూల్లో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న నరహరి అంజిరెడ్డిని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధానకార్యద ర్శులు ఎం.కృష్ణయ్య, వి.గిరిప్రసాదరెడ్డి మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఇప్ప టివరకు అంజిరెడ్డి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా పని చేస్తున్నారు. అధ్యక్షుడిగా పనిచేసిన పులి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ చేయటంతో ఆ స్థానంలో అం జిరెడ్డిని నియమించారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. అదేవిధంగా సంఘం బలోపేతానికి కృషి చేయనున్నట్లు ఆయన వివరించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

ధైర్యవంతుడి కథ



సందీప్‌కిషన్ కథానాయకుడిగా విజయ్ తనయుడు జేసన్ సంజయ్ ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్న సంగతి తెలిసిందే. లైకా ప్రొడక్షన్స్ బేనర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ సినిమా టైటిల్‌ను ఖరారు చేసి ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదల చేశారు. 'సిగ్మా' అనేది చిత్ర టైటిల్. 'స్వతంత్ర, ధైర్యవంతమైన వ్యక్తిత్వం గల ఓ వ్యక్తి కథే ఇది. నిధి అన్వేషణ నేపథ్యంలో సాగుతుంది. అద్భుతమైన టేకింగ్‌తో రూపొందుతున్న ఈ చిత్రం ప్రేక్షకులకు థ్రిల్లింగ్ అనుభూతిని ఇస్తుంది' అని పేర్కొన్నారు. ఒక్క పాట మినహా చిత్రీకరణ పూర్తయినట్లు తెలిపారు. వేసవిలో చిత్రాన్ని విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు మేకర్స్. ఈ చిత్రానికి ఎడిటర్: ప్రవీణ్ కేఎల్, సినిమాటోగ్రాఫర్: కృష్ణన్ వసంత్, సంగీతం: థమన్.ఎస్.

అబ్బాయిలు క్లాప్స్ కొడుతున్నారు



అనూ ఇమ్మాన్యుయేల్

'ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాలో నా పాత్ర కన్నా కథే నన్ను ఎక్కువగా ప్రభావితం చేసింది. ఈతరం అమ్మాయిలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి చర్చించే మంచి చిత్రమిది. అందుకే హీరోయిన్ పాత్ర కాకపోయినా అంగీకరించాను. కొన్ని సన్నివేశాల్లో నా నటనకు అబ్బాయిలు క్లాప్స్ కొడుతుండడం సంతోషాన్నిస్తోంది' అని అనూ ఇమ్మాన్యుయేల్ అన్నారు. రష్మిక మందన్న లీడ్‌రోల్‌లో నటించిన చిత్రమిది. రాహుల్ రవీంద్రన్ దర్శకుడు. ఇటీవలే విడుదలై చక్కటి ఆదరణతో కొనసాగుతోంది. ఈ చిత్రంలో కీలక పాత్ర పోషించిన అనూ ఇమ్మాన్యుయేల్ మీడియాతో మాట్లాడారు. ఒక మంచి సినిమాలో భాగమవ్వాలనే ఈ చిత్రంలో నటించాను. ఈ సినిమాను మంచి హిట్‌గా నిలిపిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇందులో దుర్గ అనే పాత్రలో నటించాను. నా వ్యక్తిత్వానికి పూర్తి భిన్నంగా ఉండే పాత్ర కావడంతో ప్రేక్షకులు ఎలా స్పందిస్తారో అని కంగారు పడ్డాను. రాహుల్ నా పాత్రను ప్రత్యేక శ్రద్ధతో తీర్చిదిద్దారు. ఇకపై నటనకు ఆస్కారమున్న కథానాయికల పాత్రలే చేయాలనుకుంటున్నాను' అని ఆమె చెప్పారు.



కుమారి పాత్ర దక్కడం నా అదృష్టం

'కాంత' చిత్రంలో కుమారి పాత్ర చేయడం నా అదృష్టం. ఇది నా కెరీర్‌లో చాలా ప్రత్యేకమైన చిత్రం. రెగ్యులర్ హీరోయిన్ తరహాలో కాకుండా ఇందులో నటనా ప్రాధాన్యమైన పాత్ర దక్కింది' అని కథానాయిక **భాగ్యశ్రీ బోర్సే** అన్నారు. దుల్కర్ సల్మాన్, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించిన చిత్రమిది. సెల్వమణి సెల్వరాజ్ దర్శకత్వంలో దుల్కర్ సల్మాన్‌తో కలసి రానా నిర్మించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా సినిమా విశేషాలను భాగ్యశ్రీ బోర్సేమీడియాతో పంచుకున్నారు.

● కెరీర్ ఆరంభంలోనే నాకు కుమారి లాంటి మంచి పాత్ర దొరికినందుకు ఆనందంగా ఉంది.'కాంత' చిత్రంలో నటిగా నాకు సవాల్ విసిరే పాత్రను పోషించాను. 1960ల నాటి నేపథ్యం కావడంతో నా పాత్ర కోసం చాలా సన్నద్ధమవ్వాల్సి వచ్చింది. చాలా కష్టమనిపించింది. శ్రీదేవి, సావిత్రి నటించిన పాత సినిమాలు చూశాను. వారి నటన స్ఫూర్తిగా కుమారి పాత్రను నాదైన శైలిలో ఆవిష్కరించేందుకు ప్రయత్నించాను.

● నేను ఇండస్ట్రీలోకి వచ్చాక తొలిసారి విన్న కథ ఇదే. అయితే చిత్రీకరణలో జాప్యం వల్ల నేను నటించిన ఇతర చిత్రాలు ముందు విడుదలయ్యాయి. దుల్కర్ సల్మాన్, రానాతో నటించడం మరింత ఆనందాన్నిచ్చింది. దర్శకుడు సెల్వ నా పాత్రను తీర్చిదిద్దిన విధానం అద్భుతం.

మా నాన్న బతికే ఉన్నాడు..

-ఈషా డియోల్



బాలీవుడ్ నటుడు ధర్మేంద్ర మరణించారంటూ మంగళవారం వార్తలొచ్చాయి. వీటిని ఆయన కుమార్తె ఈషా డియోల్ ఖండించారు. ఆ వార్తలు అవాస్తవం అని తెలిపారు. తమ కుటుంబం చెప్పేవరకూ ఎలాంటి వదంతులు వ్యాప్తి చేయొద్దని కోరారు. ధర్మేంద్రకు ముంబైలోని బ్రీచ్ క్యాండీ ఆస్పత్రిలో చికిత్స జరుగుతోందని, ప్రస్తుతం ఆయన ఆరోగ్యం బాగానే ఉందన్నారు. ఈ మేరకు ఓ పోస్ట్ పెట్టారు. 'మా నాన్న క్షేమంగానే ఉన్నారు. మేము ప్రస్తుతం ప్రైవసీని కోరుకుంటున్నాం. ఆయన కోలుకోవాలని కోరుకున్నవారందరికీ కృతజ్ఞతలు' అని పేర్కొన్నారు.ఈ ఫేక్ వార్తలపై ధర్మేంద్ర సతీమణి హేమమాలిని స్పందించారు. 'చికిత్స పొందుతూ కోలుకుంటున్న వ్యక్తి గురించి ఇలాంటి వార్తలు రాయడం క్షమించరానిది. బాధ్యత గల మీడియా ఛానళ్లు ఇలాంటి తప్పుడు వార్తలని ఎలా ప్రచారం చేస్తాయి. ఇది అత్యంత అవమానకరమైన, నిర్లక్ష్యమైన చర్య' అని అసహనం వ్యక్తం చేశారు.

భారీ యాక్షన్ డ్రాప్‌లో




కొత్త తరహా కథాంశంతో తెరకెక్కిన క్రైమ్ థ్రిల్లర్ 'రాబందు'. జయశేఖర్ కల్లు దర్శకత్వంలో పులిజాల సురేశ్ నిర్మించారు. త్వరలో ప్రేక్షకుల ముందుకు రానుంది. మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో తెలంగాణ సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు మాట్లాడుతూ నేటి సమాజంలో చర్చనీయాంశంగా మారిన కొన్ని అంశాల ఆధారంగా రాసుకున్న కథతో ఈ చిత్రాన్ని భారీ యాక్షన్ డ్రాప్‌లో తెరకెక్కించాం' అని చెప్పారు. 'చిత్ర నిర్మాణంలో రాజీ పడకుండా భారీ వ్యయంతో నిర్మించాం' అని నిర్మాత చెప్పారు.

నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్



రోడ్ ట్రిప్ నేపథ్యంలో తెరకెక్కిన చిత్రం గోపీ గాళ్ల గోవా ట్రిప్'. రోహిత్, శశి దర్శకత్వం వహించారు. సాయికుమార్, సీతారామరాజు, రమణారెడ్డి నిర్మించారు. అజిత్ మోహన్, రాజు శివరాత్రి తదితరులు కీలకపాత్రలు పోషించారు. ఈ నెల 14న విడుదలవుతోంది. మంగళవారం చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ సందర్భంగా రోహిత్ మాట్లాడుతూ'గతంలో మేము తెరకెక్కించిన లఘు చిత్రాలకు మంచి పేరు వచ్చింది. యువతకు చక్కని సందేశంతోపాటు నాన్‌స్టాప్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను అందించాలనే లక్ష్యంతో ఈ చిత్రం చేశాం. హాలీవుడ్ తరహా మేకింగ్‌తో ఎంతో కష్టపడి తెరకెక్కించాం' అని చెప్పారు.'కథలో ఊహించని మలుపులు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి, కొన్నాళ్లపాటు ప్రేక్షకులను వెంటాడే సినిమా ఇది. అన్ని విభాగాలు ఎంతో శ్రమకోర్చి పనిచేసి మంచి అవుట్‌పుట్‌ను రాబట్టాయి' అని నిర్మాతలు చెప్పారు.

ఆస్పత్రిలో చేరిన బాలీవుడ్ విలన్



బాలీవుడ్ సీనియర్ నటుడు, విలన్ పాత్రల పోషణలో తనకంటూ ఓ ప్రత్యేకత ఏర్పరచుకున్న ప్రేమ్ చోప్రా(92) అనారోగ్య కారణాలతో సోమవారం ముంబైలోని లీలావతి ఆస్పత్రిలో చేరారు. వైరల్ ఇన్‌ఫెక్షన్, వయసు రీత్యా వచ్చే ఇబ్బందుల వల్ల ప్రేమ్‌చోప్రా అస్వస్థతకు గురయ్యారనీ, త్వరలోనే ఆయన కోలుకుంటారనీ చికిత్స చేస్తున్న డాక్టర్లు చెప్పారు. 1960-70ల దశకంలో విలన్‌గా ఓ వెలుగు వెలిగారు ప్రేమ్‌చోప్రా. ఆరు పదుల తన నట జీవితంలో ఆయన 380 చిత్రాల్లో నటించారు. సంభాషణలు పలికే తీరు, ఎక్స్‌ప్రెషన్స్‌తో నటుడిగా తన ప్రత్యేకతను చాటుకున్న ప్రేమ్‌చోప్రా బాలీవుడ్‌లోని ప్రముఖ విలన్లలో ఒకరిగా వెలిగారు. 'ఓ కౌన్ థీ'(1954), 'ఉపాకర్(1967), దో రాస్తే (1969), 'కటీ పతంగ్'(1970), బాబీ (1973), దో అంజానే (1976), త్రిశూల్ (1978), దోస్తానా (1980) తదితర చిత్రాల్లో ప్రేమ్‌చోప్రా అభినయం ఇప్పటికీ గుర్తుంటుంది.

నాలుగు తరాల కథ ఇది

- అక్కినేని నాగార్జున



'నాకు పూర్వ జన్మల నేపథ్యంలో తీసిన సినిమాలు చాలా ఇష్టం. అదే సబ్జెక్టుతో వచ్చిన నాన్నగారి 'మూగ మనసులు', నేను నటించిన 'జానకి రాముడు' సూపర్ హిట్ అయ్యాయి. 'గత వైభవం' కూడా నాలుగు తరాల కథ. ఈ సినిమా తీయడానికి ఎంత కష్టపడ్డారో ట్రైలర్ చూస్తూంటే అర్థమవుతోంది. సన్నివేశాలు అద్భుతంగా ఉన్నాయి. సినిమా పెద్ద బ్లాక్‌బస్టర్ కావాలి' అని హీరో నాగార్జున ఆకాంక్షించారు. ఎస్ఎస్ దుష్యంత్, ఆషికా రంగనాథ్ ప్రధాన పాత్రధారులుగా సింపుల్ సుని దర్శకత్వంలో తెరకెక్కించిన చిత్రం 'గత వైభవం'. సర్వేగర సిల్వర్ స్క్రీన్స్, సుని సినిమాస్ బేనర్లపై దీపక్ తిమ్మప్ప, సుని నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ వేడుకను నిర్వహించింది. ఈ కార్యక్రమానికి నాగార్జున ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా హీరో దుష్యంత్ మాట్లాడుతూ 'నాలుగు జన్మలకు సంబంధించిన చిత్రమిది. స్క్రీన్‌ప్లే చాలా కొత్తగా ఉంటుంది' అని తెలిపారు. చిత్రదర్శకుడు సింపుల్ సుని మాట్లాడుతూ 'ఇదొక డిఫరెంట్ జానర్ సినిమా. అన్ని వ్యాపారాంశాలు ఉన్న ప్రయోగాత్మక చిత్రం. ప్రేక్షకులు తప్పకుండా ఆదరిస్తారనే నమ్మకం మాకుంది' అని అన్నారు.

సంతాన ప్రాప్తిరస్తు విజయం ఖాయం



విక్రాంత్, చాందినీ చౌదరి జంటగా సంజీవ్ రెడ్డి తెరకెక్కించిన చిత్రం 'సంతాన ప్రాప్తిరస్తు' మధుర ఎంటర్‌టైన్‌మెంట్, నిర్వి ఆర్ట్స్ బేనర్‌పై మధుర శ్రీధర్ రెడ్డి, నిర్వి హరిప్రసాద్ రెడ్డి నిర్మించారు. సినిమా ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్ర బృందం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించింది. దర్శకులు బాబీ, సందీప్ రాజ్,శైలేశ్ కొలను, బీవీఎస్ రవి, నిర్మాత లగడపాటి శ్రీధర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బాబీ మాట్లాడుతూ "సంతాన ప్రాప్తిరస్తు' ట్రైలర్ బాగుంది. ఇలాంటి సున్నిత కథాంశాన్ని అందరికీ నచ్చేలా చేప్పే ప్రయత్నం చేశారు. తప్పకుండా సినిమా మంచి విజయం సాధిస్తుంది' అని అన్నారు. సందీప్‌రాజ్ మాట్లాడుతూ 'నా తొలి సినిమాకు హీరోయిన్ చాందినీ. ఆమె ఒక సినిమా చేస్తుందంటే అందులో కంటెంట్ ఉంటుందనే పేరు తెచ్చుకున్నారు' అని అన్నారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'ఒక సున్నిత కథాంశంతో వినోదాన్ని కలిపి తీసిన చిత్రమిది. గతంలో ఇలాంటి సినిమాలు మంచి విజయం సాధించాయి. ఈ మూవీ కూడా పెద్ద హిట్ అవుతుంది' అని పేర్కొన్నారు. చిత్ర దర్శకుడు సంజీవ్ రెడ్డి మాట్లాడుతూ 'సంతాన సమస్యలు ఉన్న వారు చికిత్స తీసుకోవచ్చు. కానీ అన్నీ బాగుండి లైఫ్ స్టయిల్ వల్ల సంతాన లేమితో బాధపడేవారి గురించి ఈ సినిమాలో చర్చించాం. మంచి ప్రేమ కథ, వినోదంతో పాటు గొప్ప సందేశమూ ఉంటుంది' అని వివరించారు. నిర్మాత మధుర శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ 'ఈ చిత్రంతో ఒక మంచి ప్రయత్నం చేశాం. విడుదలకు ముందు చిన్న చిత్రం గురించి చెప్పేందుకు ఏమీ ఉండదు, రిలీజ్ అయ్యాక అది సాధించే విజయాలకు అడ్డు ఉండదు' అని అన్నారు.

ముక్కోణపు ప్రేమకథ



గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ఎమోషనల్ డ్రామా 'రోలుగుంట సూరి'. అనిల్ కుమార్ పల్లా దర్శకుడు. నాగార్జున పల్లా, ఆధ్యారెడ్డి, భావన నీలప్ హీరో హీరోయిన్లుగా నటించారు. సౌమ్యా చాందిని నిర్మించారు. ఈనెల 14న విడుదలవుతోంది. ఈ సందర్భంగా మంగళవారం చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ ఈవెంట్లో అనిల్ కుమార్ మాట్లాడుతూ 'గ్రామీణ నేపథ్యంలో తెరకెక్కిన ముక్కోణపు ప్రేమకథా చిత్రమిది. మాస్ అంశాలతో పాటు కట్టిపడేసే భావోద్వేగాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయి' అని అన్నారు. వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రమిది అని సౌమ్యా చాందిని తెలిపారు. తెలుగులో అరుదైన, అద్భుతమైన సినిమాగా 'రోలుగుంట సూరి' మిగిలిపోవడం ఖాయం అని నాగార్జున పల్లా చెప్పారు.

పర్చూరును తీవ్ర వరద ప్రభావిత ప్రాంతంగా ప్రకటించండి

- నష్ట పోయిన ప్రతి రైతును ఆదుకోవాలి
- వరదకు శాశ్వత పరిష్కారానికి వినతి
- హైవే నిర్మాణంలో లోపాలు సరిదిద్దాలి
- కేంద్ర బృందానికి ఎమ్మెల్యే ఏలూరి లేఖ

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : మొంథా తుపాన్ ప్రభావంతో పర్చూరు నియోజకవర్గం తీవ్రమైన వరద విపత్తును ఎదుర్కొందని, వ్యవసాయం, వాగులు, కాలువలు, రహదారులు సహా అన్నీ రంగాలు భారీగా నష్టాన్ని చవిచూశాయని పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. పర్చూరును తీవ్ర వరద ప్రభావిత ప్రాంతంగా ప్రకటించి నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలన్నారు. కోట్లాది రూపాయల నష్టాన్ని పూడ్చేందుకు భారీగా సాయం అందించాలన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు రాసిన లేఖను కేంద్ర ప్రభుత్వ ఇంటర్ మినిస్టీరియల్ సెంట్రల్ టీం వివిధ మంత్రిత్వ శాఖల ఉన్నతాధికారులు పి.పౌసుమి బసు, మహేష్ కుమార్, శశాంక్ శేఖర్ రాయ్, సాయి భగీరథ్‌లతోపాటు, రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్‌లకు లేఖను పర్చూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుంజి వెంకట్రావు, రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్లు, నాయకుల సారథ్యంలో అందజేశారు.

వేలాది ఎకరాల్లో పంటల నష్టం

తుఫాను ప్రభావంతో వేలాది ఎకరాల్లో వరి, ప్రత్తి, మినుములు, మిర్చి వంటి ప్రధాన పంటలు తీవ్రంగా నష్టపోయామన్నారు. ఇప్పటికే రైతుల వద్ద ఉన్న నల్లబర్లీ కొనుగోలు చేయలేదని తక్షణమే కొనుగోలు చేయాలని కోరారు. వర్షాలకు రైతులు సర్వస్వం కోల్పోయారని, దీని నుంచి బయట పడాలంటే వందశాతం నష్టపరిహారం అందించాలన్నారు.

కల్వర్టులు లేకపోవడంతో మునిగిన గ్రామాలు

ఇటీవల నిర్మించిన పిడుగురాళ్ల- వాడరేవు జాతీయ రహదారి (167ఏ) నిర్మాణంలో సరైన ప్రమాణాలను పాటించకపోవటం, డ్రెయిన్లు ఏర్పాటు చేయక పోవడంతో నీరు నిలిచి పర్చూరు, కారంచేడు పరిధి లోని పలు గ్రామాలు, వరద నీటిలో మునిగిపోయాయన్నారు. దీంతో పంట భూములతోపాటు, ప్రజలకు కూడా తీవ్రనష్టం వాటిల్లిందన్నారు.

కొమ్మమూరుపై వందకు పైగా గండ్లు..

తుఫాన్ సమయంలో కృష్ణా వెస్టన్ డెల్టా (కొమ్మమూరు) కాలువ ఒత్తిడిని తట్టుకోలేక వందకు పైగా గండ్లు పడ్డాయన్నారు. కొమ్మమూరు కాలువ పునరుద్దరణకు ప్రత్యేక ఆధునికీకరణ ప్యాకేజ్ ఇవ్వాలని ఏమ్మెల్యే కేంద్రబృందానికి విజ్ఞప్తి చేశారు. పోతుకట్ల సమీపంలో సాకి వాగు, అలాగే కారంచేడు వద్ద అండర్ టన్నెల్లు, బ్రిటీష్ కాలం నాటి నిర్మాణాలను ఆధునీకరించాలని కోరారు.

సముద్రాన్ని తలపించిన పంటభూములు

వైసీపీ ఐదేళ్ల పాలనలో వాగులు, కాలువలు, అస్తవ్యస్తంగా మారాయని, కనీసం మరమ్మతులకు కూడా నోచుకోక పోవడంతో ఇలాంటి పరిస్థితి ఏర్పడిందన్నారు. ప్రధానంగా సాకివాగు, పర్చూరు వాగు, నక్కల వాగు, కప్పల వాగు, తొండి వాగు, ఆలేరు వాగు, అప్పేనరు, రొంపేరు వంటి కీలక వాగుల్లో పూడికలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి ఉన్నాయన్నారు. నీరు ప్రవహించేందుకు అవకాశం కూడా లేకుండా పోయిందన్నారు. పలు చోట్ల కట్టలు తెగిపోవటం, గండ్లు పడటంతో పంటలు పూర్తిగా నీటమునిగి దెబ్బతిన్నాయన్నారు. ఈ వాగుల్లో పూడిక తీసి కట్టలను సరిచేయాలని వారి నివేదికలో ప్రస్తావించారు.



కేంద్ర బృందానికి ఎమ్మెల్యే సాంబశివరావు రాసిన లేఖను అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ వెంకట్రావు

అవీ..ఇవీ..

అర్హత ఉన్న అందరికీ స్త్రీనిధి రుణాలు

- స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్



వీవోఏలకు సూచినలిస్తున్న స్త్రీనిధి మేనేజర్ నాగశంకర్

పంగులూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): అర్హులైన అందరికీ స్త్రీనిధి రుణాలు అందజేయాలని స్త్రీనిధి జిల్లా మేనేజర్ నాగశంకర్ అన్నారు. మండల కేంద్రమైన పంగులూరులోని వెలుగు కార్యాలయంలో స్త్రీనిధి రుణాల మంజూరుపై గ్రామైక్య సంఘాల ప్రతినిధులు, వీవోఏల సమావేశం మంగళవారం ఏపీఎం కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించారు. మండలంలో స్త్రీనిధి రుణాల కోసం పలు డ్వాక్రా సంఘాల మహిళలు దరఖాస్తు చేసుకున్నారని, డాక్యుమెంట్లు పరిశీలించి అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ స్త్రీనిధి రుణం మంజూరు చేయాలన్నారు. రుణాలు పొందిన వారు ఎంచుకున్న వ్యాపారాలను సక్రమంగా నిర్వహించుకునేలా చూడాలన్నారు. స్త్రీనిధి రుణంపొందిన మహిళలు వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవాలన్నారు. రుణ కంతులు సకాలంలో తిరిగి చెల్లించాలని నాగశంకర్ కోరారు. కార్యక్రమంలో సీసీ చంద్ర, ఐక్యసంఘాల ప్రతినిధులు, వీవోఏలు పాల్గొన్నారు.

ఇద్దరు హిజ్రాలపై కేసు నమోదు

మార్టూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జొన్నతాళి కూడలి వద్ద సర్వీస్ రోడ్డులో వాహనదారులను అసౌకర్యానికి గురిచేస్తూ డబ్బువసూలు చేస్తూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న నవిత, అనిత అనే ఇద్దరు హిజ్రాలపై కేసు నమోదు చేసినట్లు మంగళవారం ఏఎస్‌ఐ బాషా తెలిపారు. వారు జొన్నతాళి రోడ్డువద్ద సర్వీస్‌రోడ్డులో భిక్షాటన చేస్తూ వాహనదారులను ఇబ్బంది పెడుతున్నట్లు తమదృష్టికి ఫిర్యాదులు రాగా, వారిపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

ఇంటి ముందు ఉన్న ద్విచక్ర వాహనం దగ్ధం

- వేటపాలెం పోలీసులను ఆశ్రయించిన అస్సాం వాసి

వేటపాలెం(చీరాల), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటి ముందు ఉంచిన ద్విచక్ర వాహనాన్ని గుర్తుతెలియని వ్యక్తులు బూడిద చేశారు. ఈ ఘటన వేటపాలెం మండలం జబ్బార్ కాలనీలో సోమవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. అస్సాంకు చెందిన అలీమ్ ఉద్దీన్ కొంతకాలంగా గ్రామంలో నివాసం ఉంటూ ఓ రొయ్యల ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. అయితే మంగళవారం ఉదయం చూసేసరికి వాహనం దగ్ధమై ఉండడంతో వేటపాలెం పోలీసులను ఆశ్రయించాడు. ఒకరిపై అనుమానం కూడా వ్యక్తం చేశాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారును ఢీ కొన్న స్కూల్ బస్సు

- తప్పిన ప్రమాదం
- బస్సులో 20 మంది చిన్నారులు

బుర్లవారిపాలెం (చీరాల), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కారును వెనుక నుండి స్కూల్ బస్సు ఢీకొన్న ఘటన మంగళవారం సాయంత్రం 216 జాతీయ రహదారిలో బుర్లవారిపాలెం వద్ద చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. బాపట్ల వైపు నుంచి ఒంగోలు వైపు ఓ కారు ప్రయాణిస్తోంది. అదే సమయంలో ఆ కారు వెనుక బాపట్ల వైపు నుంచి సుమారు 20 మంది చిన్నారులతో స్కూల్ బస్సు వస్తోంది. ప్రమాదవశాత్తు స్కూల్ బస్సు వెనుక నుంచి కారును ఢీకొనగా అద్దాలు పూర్తిగా ధ్వంసం అయ్యాయి. కారులో ఉన్న ఇరువురు స్వల్పంగా గాయపడ్డారు. అయితే వెంటనే రెండు వాహనాలు అదుపు చేయడంతో ప్రమాదం తప్పింది.

ప్రమాదవశాత్తు భవననిర్మాణ కార్మికుడి మృతి

ఇంకొల్లు, నవంబరు 11, (ఆంధ్రజ్యోతి) : గృహనిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదవశాత్తు కిందపడి కూలీ మృతి చెందిన ఘటన మండలంలోని ఇడుపులపాడులో మంగళవారం చోటుచేసుకొంది. ఇంకొల్లుకు చెందిన గుంజి సూర్యనారాయణ(40) ఇడుపులపాడులో ఓ గృహనిర్మాణ శ్లాబు సెంట్రింగ్ పనులు చేస్తూ, ప్రమాదవశాత్తు కిందపడడంతో తలకు బలమైన గాయాలైయ్యాయి. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుని భార్య సుమంజలి ఫిర్యాదు మేరకు ఎస్సై సురేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామ న్నారు. సూర్యనారాయణ మృతదేహాన్ని పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు.

నేడు నల్లమడ రైతుసంఘం సమావేశం

పర్చూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించే విషయంపై నేడు పర్చూరులో నల్లమడ రైతుసంఘం ఆధ్వర్యంలో సమావేశం నిర్వహిస్తున్నట్లు నల్లమడ రైతుసంఘం ప్రతినిధులు కొల్లా రాజమోహన్‌రావు, అడ్డగడ్డ వెంకటేశ్వర్లు, మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు ఛానల్‌ను పర్చూరు వరకు పొడిగించేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, దానికి సంబంధించి గజిట్ నోటిఫికేషన్ కూడా ఇచ్చారన్నారు. కానీ కాలువను పర్చూరు ప్రాంతానికి పొడిగించేందుకు నోటిఫికేషన్ ఇవ్వకపోవటంతోపాటు, నిధులను కూడా కేటాయించలేదన్నారు. ఇలా జరిగితే పర్చూరు ప్రాంతానికి తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. దీన్ని అధిగమించి కాలువను పర్చూరు వరకు పొడిగించుకునేందుకు రైతులు, ప్రజలు సన్నద్ధం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నేడు తలపెట్టనున్న సమావేశానికి అధిక సంఖ్యలో రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎస్ఆర్ఆర్ విద్యార్థులు

పంగులూరు, నవంబరు 11(ఆంధ్రజ్యోతి): పంగులూరు ఎస్ఆర్ఆర్ ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్న ముగ్గురు ఖోఖో క్రీడాకారులు ఎస్‌జీఎఫ్. జాతీయస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొనేందుకు అర్హత సాధించారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో విజయనగరంలో జరిగిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి అండర్-19 బాలుర ఖోఖో పోటీలలో ఉమ్మడి ప్రకాశం జిల్లా జట్టు విజయానికి కృషిచేసిన నక్కా భరత్‌కుమార్, ఇందూరి ప్రవీణ్‌రెడ్డి, చెన్నూరి బాజీబాబులకు రాష్ట్ర జట్టులో స్థానం లభించింది. విజయనగరానికి చెందిన నక్కా భరత్‌కుమార్, పల్నాడు జిల్లా కారంపూడికి చెందిన ఇందూరి ప్రవీణ్‌రెడ్డి. పంగులూరుకు చెందిన చెన్నూరి బాజీబాబులు పాఠశాల స్థాయి నుంచి పంగులూరులో విద్యనభ్యశిస్తూ స్థానిక ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు పంగులూరు ఎంఎస్ఆర్ అండ్ బీఎస్ఎం జూనియర్ కళాశాలలో సీని యర్ ఇంటర్ చదువుతున్నారు.

పాఠశాల స్థాయి నుంచే శిక్షణ

నక్కా భరత్ కుమార్, ఇందూరి ప్రవీణ రెడ్డి, చెన్నూరి బాజీ బాబులు పాఠశాల స్థాయి నుంచి పంగులూరులో విద్యనభ్యశిస్తూ స్థానిక ఖోఖో అకాడమీలో శిక్షణ పొందుతున్నారు. ఈ ముగ్గురు విద్యార్థులు ఇప్పటి వరకు చిత్తూరు, కాకినాడలలో జరిగిన జూనియర్, అండర్-14 రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలలో పాల్గొన్నారు. మహారాష్ట్రలోని నాసిక్‌లో జరిగిన అండర్- 17 జాతీయస్థాయి పోటీలలో పాల్గొని ప్రతిభ చాటారు. ఈ నెల 8, 9, 10 తేదీలలో విజయనగరంలో జరిగిన రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ అండర్-19 బాలుర ఖోఖో పోటీలలో సత్తా చాటారు. వీరితో పాటు వారికి శిక్షణ ఇచ్చిన సీతారామిరెడ్డిలను ఏపీ ఖోఖో అసోషియేషన్ చైర్మన్ డాక్టర్ గరటయ్య, ఆర్‌ఐ ఆంజనేయులు, ఎస్‌జీఎఫ్. జిల్లా కార్యదర్శి చింపారెడ్డిలు అభినందించారు.



నక్కా భరత్‌కుమార్, ఇందూరి ప్రవీణ్‌రెడ్డి, .చెన్నూరి బాజీబాబు

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

- సెంట్రల్ టీంకు నష్టాల వివరాలు అందజేసిన ఎమ్మెల్యే



పౌసుమిబసుకు నష్టాల వివరాలను అందిస్తున్న ఎమ్మెల్యే కొండయ్య

చీరాల, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గంలో నష్టపోయిన రైతులను కేంద్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎమ్మెల్యే కొండయ్య కోరారు. నష్టాల పరిశీలనకు మంగళవారం చీరాల ఐటీసీ గెస్ట్‌హౌస్‌కు విచ్చేసిన కేంద్ర మంత్రిత్వశాఖ జాయింట్ సెక్రటరీ పౌసుమిబసు, కలెక్టర్ వినోద్‌కుమార్‌లను ఎమ్మెల్యే మర్యాద పూర్వకంగా కలిశారు. దెబ్బతిన్న వరి, వేరుశనగ పంటల వివరాలను వారికి అందజేశారు. నియోజకవర్గంలో కడుపేద రైతులు ఉన్నట్లు వివరించారు. అలాగే వారితో కలిసి గెస్ట్‌హౌస్‌లో జిల్లా యంత్రాంగం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. వారి వెంట పలువురు సెంట్రల్ టీం సభ్యులు, ఆర్డీవో చంద్రశేఖర్ నాయుడు, తహసీల్దార్ గోపీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ సాంబశివరావు ఉన్నారు.

సేంద్రియ సాగుతో భూసారం పెంపు

మార్టూరు ఏడీఏ సుదర్శనరాజు

పంగులూరు, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): రైతులు పంటసాగులో సేంద్రియ పద్ధతులు పాటించడం ద్వారా భూసారం పెంపొందించుకోవచ్చని మార్టూరు ఏడీఏ సుదర్శనరాజు సూచించారు. మంగళవారం మండలంలోని కొండమంజులూరు, కోటపాడు గ్రామాలలో పొలంపిలుస్తుంది కార్యక్రమంలో ఏడీఏ సుదర్శనరాజు ఏవో సుబ్బారెడ్డి, స్థానిక రైతులతో కలసి వరి పొలాలను పరిశీలించారు. అనంతరం జరిగిన గ్రామసభలో మాట్లాడుతూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం చేపట్టాలన్నారు. తద్వారా ఎరువులపై ఖర్చు తగ్గించుకోవడంతో పాటు చీడపీడల ఉధృతి తగ్గించుకోవచ్చన్నారు. వరినారు నాటే ముందు ఆకు చివరలు తుంచడం ద్వారా తొలిదశలో పైరుకు ఆశించే పురుగుల ఉధృతి తగ్గించవచ్చని సూచించారు. చదరపు మీటరుకు 44 కుదురులు ఉండే విధంగా చేయడం వలన అధిక దిగుబడులు సాధించవచ్చని తెలిపారు. పంటసాగు చేసే భూయజమాని, కౌలురైతులు పంటనమోదు చేసుకుని ప్రభుత్వ ప్రయోజనాలు పొందాలని కోరారు. కార్యక్రమంలో ఏవో సుబ్బారెడ్డి, పీఏసీఎస్ అధ్యక్షుడు బత్తుల వెంకట్రావు, టీడీపీఆ నేత చింతల సహదేవుడు, గడ్డం నాగేశ్వరరావు, వ్యవసాయ సహాయకులు పవిత్ర, రోజి, రైతులు పాల్గొన్నారు.



రైతులకు సూచనలిస్తున్న ఏడీఏ సుదర్శనరాజు

ఘనంగా యూనియన్ బ్యాంకు ఆవిర్భావదినోత్సవం

బల్లికురవ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అంబడిపూడి గ్రామంలోని యూనియన్ బ్యాంకు 107వ అవిర్భావదినాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక బ్యాంకులో ఖాతాదారులు సిబ్బంది కేక్‌ను కట్ చేశారు. ఈ సందర్భంగా మేనేజర్ గుమ్మడి ప్రవీణ్‌రాజ్ మాట్లాడుతూ తమ బ్యాంకు ద్వారా మెరుగైన సేవలు ప్రజలకు అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులకు సకాలంలో రుణాలను అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేనేజర్ నాగుల్‌మీరా, పశువైద్యాధికారిణి పావనీకుమారి, ఖాతాదారులు బొట్టగుంట వేణుబాబు, దద్దాల అంజయ్య, కట్టా రామకృష్ణ, ఈర్తినేని పెద్దన్న, సుబ్బారావు, దూళిపాళ్ల ఆదిశేషయ్య, వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



కేక్‌ను కట్ చేస్తున్న ఖాతాదారులు

కుంకలమర్రులో చోరీ

- రూ.30 సవర్ల బంగారం, రూ.25వేల నగదు అపహరణ
- ఆధారాలను సేకరించిన క్లూస్ టీం

కుంకలమర్రు(పర్చూరు), నవంబరు 11 (ఆంధ్రజ్యోతి) : కారంచేడు మండలం కుంకలమర్రు గ్రామంలో చోరీ ఘటన మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అర్వపల్లి కోటేశ్వరరావు ఇంట్లో దొంగలు చోరీకి పాల్పడి 30 సవర్ల బంగారు ఆభరణాలు, 25 వేల నగదును అపహరించినట్లు బాధితులు తెలిపారు. చోరీ విషయం తెలుసుకున్న ఇంకొల్లు సీఐ రమణయ్య, కారంచేడు ఎస్సై ఖాదర్ బాషా తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొన్నారు. చోరీ జరిగిన నివాసాన్ని పరిశీలించారు. బాదితులు కుటుంబ సభ్యులతో కలసి ద్వారకా తిరుమల దైవదర్శనానికి వెళ్లిన క్రమంలో చోరీ జరిగింది. సోమవారం తెల్లవారు జామున బాదితులు ఇంటికి వచ్చి చూసేసరికి వెనుక తలుపు పగులకొట్టి చోరీకి పాల్పడినట్లు గుర్తించారు. స్థానికుల సహకారంతో పోలీసులకు సమాచారం అందించారు. దీనిపై పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డిసెంబర్ 13న జాతీయ లోక్‌అదాలత్

అద్దంకి, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): కోర్టు భవనాల సముదాయంలో డిసెంబరు 13న జరిగే జాతీయ లోక్‌అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి మండల న్యాయసేవాధికార సంస్థ చైర్మన్ నాగవెంకటలక్ష్మి కోరారు. లోక్‌అదాలత్‌లో రాజీ చేయదగిన అన్ని క్రిమినల్, సివిల్ కేసులు, ప్రీ లిటికేషన్ కేసులు పరిష్కరించు కోవచ్చన్నారు.

గ్రానైట్ ముడిరాయి బరువును పరిశీలించిన అధికారులు

బల్లికురవ, నవంబరు11(ఆంధ్రజ్యోతి): గ్రానైట్ క్వారీల నుంచి ముడిరాయి ఎగుమతులను మంగళవారం మైనింగ్ విజిలెన్స్ ఏడీ రామచంద్ర పరిశీలించారు. క్వారీల నుంచి అనుమతితో ముడిరాయి ఎంత టన్నేజ్‌తో పోతోంది.. దాని ద్వారా కటింగ్ మిషన్ల ద్వారా ఎన్ని అడుగులు ఉత్పత్తి వస్తోంది అన్న వివరాలను సేకరించి తనిఖీలు చేశారు. ప్రభుత్వం మైనింగ్ రాయల్టీలపై ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయగా అందులో భాగంగా ముడిరాయి వివరాల సేకరణకు బల్లికురవ మండలం వేమవరం నాలుగు రోడ్ల జంక్షన్‌లో ముడిరాయి లారీని అధికారులు కాటా వేయించారు. కార్యక్రమంలో ఏజీ సురేష్‌రెడ్డి, ఆర్‌ఐ రాజు తదితరులు పాల్గొన్నారు.



ముడిరాయిని కాటా వేయిస్తున్న మైనింగ్ విజిలెన్స్ అధికారులు

సర్వర్ సమస్యతో నిలిచిన లోడింగ్‌లు

మైనింగ్ సీనరేజ్ వసూళ్లను చేస్తున్న ఏఎంఆర్ ప్రైవేట్ కంపెనీకి చెందిన సర్వర్ మంగళవారం ఉదయం నుంచి పని చేయలేదు. దీంతో ముడిరాయి రవాణా నిలిచి పోయింది. చెక్‌పోస్టులలో ఉన్న సిబ్బంది లారీలను ముందుకు వెళ్లనీయకపోవడంతో పలు ఫ్యాక్టరీల యజమానులు క్వారీలలోనే లారీలకు ఎత్తిన రాళ్లను మరలా అక్కడే అన్‌లోడ్ చేశారు. సర్వర్ సమస్యతో రాళ్ల లేక పలు ఫ్యాక్టరీలలో పనులు మందగించాయి.

వరికి నీరందడం లేదని రైతుల ఫిర్యాదు

- తక్షణమే స్పందించిన మంత్రి
- చిల్లచెట్లను తొలగించాలని టీడీపీ నేతలకు ఆదేశం

బల్లికురవ, నవంబరు11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నుపల్లి మేజర్ కాలువలో చిల్లచెట్లు దట్టంగా అల్లుకొని పంటలకు సకాలంలో సాగునీరు అందక పంటలు ఎండిపోతున్నాయి. ఈ విషయాన్ని రైతులు మంగళవారం ఉదయం విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు పోటోలను పంపి ఫోనులో పిర్యాదు చేశారు. రైతులు సమస్యను తెలుసుకున్న మంత్రి వెంటనే స్పందించారు. హుటాహుటిన ఎక్స్‌కవేటర్‌తో మేజర్ కాలువను అభివృద్ధి చేసి వెంటనే సాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. నిధులు లేవని సాకులు చెప్పకుండా వెంటనే పనులు ప్రారంభం కావాలని పేర్కోన్నారు. మంత్రి ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం గంటల వ్యవధిలోనే యంత్రాన్ని తీసుకువచ్చి రాత్రి పూట కూడా చెన్నుపల్లి మేజర్ కాలువ అభివృద్ధి పనులను టీడీపీ నేతలు దగ్గర ఉండి చేయిస్తున్నారు. ఈ మేజర్ కాలువ కింద ముక్తేశ్వరం, సూరేపల్లి, రామాంజనేయపురం, చెన్నుపల్లి గ్రామాలలోని 3 వేల ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉంది. మేజర్‌లో చిల్లచెట్ల వలన ఏబీసీ నుంచి సాగునీరు ముందుకు కదలడం లేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఈ మేజర్‌ను ఒకసారి అభివృద్ధి కూడా చేశారు. వర్షాల వలన మరోసారి చెట్లు పెరగటంతో మేజర్ మూసుకు పోయిందని రైతులు తెలిపారు. దీంతో సమస్యను మంత్రి దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించారని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు మేజర్ కాలువల్లో ఉన్న చిల్ల చెట్లను వెంటనే తొలగించాలని అధికారులను కోరుతున్నారు.



రాత్రివేళలోనూ కాలవను శుభ్రం చేయిస్తున్న టీడీపీ నేతలు



నీరు లేక బీటలు వారిన వరి పొలం

శింగరకొండలో హైదరాబాద్ రేరా అడిషనల్ కమిషనర్ ప్రత్యేక పూజలు

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో హైదరాబాద్ రేరా అడిషనల్ కమిషనర్ నాదెండ్ల తిరుపతయ్య, సునీత దంపతులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుపతయ్య, సునీత దంపతులను పూజారులు ఆశీర్వదించారు. ధర్మకర్తల మండలి చైర్మన్ చుండూరి మురళీసుధాకరావు సత్కరించి స్వామి వారి ఫోటో అందజేశారు. బొడ్డపాటి రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



తిరుపతయ్య దంపతులను సత్కరిస్తున్న చైర్మన్ మురళీసుధాకరరావు

అబుల్‌కలాం జయంతి వేడుకలు

అద్దంకి, నవంబరు 11 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, తొలి కేంద్ర విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాంఅజాద్ జయంతిని మంగళవారం స్థానిక పోతురాజుగండిలోని టీడీపీ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సంద ర్భంగా టీడీపీ మైనార్టీ సెల్ నేతలు అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మైనార్టీ సెల్ నేతలు జబ్బార్, కరిముల్లా, మహబు, మాలిక్, రసూల్, వలి, అహ్మద్, ఖాశిం, సలీం, బాషా, సుభాని తదితరులు పాల్గొన్నారు.



నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు